teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 02 | సంచిక : 359 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | గురువారం | 2 మే 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## కేసీఆర్ ఎన్నికల ప్రచారంపై 48 గం.ల ఈసీ నిషేధం

### కాంగ్రెస్ నేతల ఫిర్యాదు మేరకు కేసీఆర్‌పై ఈసీ చర్యలు



హైదరాబాద్, మే 01 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల ప్రచారంపై 48 గంటల పాటు ఈసీ నిషేధం విధించింది. ఈ రోజు రాత్రి 8 గంటల నుంచి 48 గంటల పాటు కేసీఆర్ ఎన్నికల ప్రచారంపై నిషేధం విధించినట్లు ఈసీ వెల్లడించింది. కాంగ్రెస్ నేతల ఫిర్యాదు మే-రకు కేసీఆర్‌పై ఈసీ చర్యలు తీసుకుంది. సిరిసిల్లలో కాంగ్రెస్ నేతలపై కేసీఆర్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ నేత నిరంజన్ రెడ్డి ఈసీకి ఫిర్యాదు చేశారు.



## ఎండ.. కర్ఫ్యూ

### రాష్ట్రంలో 45 నుండి 46 డిగ్రీల ఉష్ణోగ్రతల నమోదు

### ఎండల తీవ్రతకు 8మంది మృతి

### ప్రజలకు పలు సూచనలు చేసిన వాతావరణశాఖ



తెలంగాణ బ్యూరో, మే 01 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో ఎండల తీవ్రత అధికంగా ఉంది. ఎన్నడూ లేని విధంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు దాటాయి. నల్లగొండ, ఖమ్మం వంటి ప్రాంతాల్లో మంగళవారం 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయినట్లు వాతావరణ శాఖ తెలిపింది. తెలంగాణలో ఎండల తీవ్రత కారణంగా ఎనిమిది మంది ఇప్పటి వరకూ మరణించారని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఎండల తీవ్రతతో పాటు వేడిగాలులకు కూడా ప్రజలు ఇబ్బంది

మిగతా 2 లో

## తెలంగాణకు బీజేపీ ఇచ్చింది గాడిద గుడ్డు

### ట్విట్టర్ వేదికగా బీజేపీపై సీఎం రేవంత్ రెడ్డి సెటైర్లు

తెలంగాణ బ్యూరో, మే 01 : (తీన్మార్ న్యూస్): పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ రాజకీయ యుద్ధం వేడెక్కుతోంది. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌లు సభలు, సమావేశాలు నిర్వహిస్తూ ఒకరిపై ఒకరు విమర్శనాస్త్రాలు వేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణలోని సమస్యలపై డిమాండ్లు పరిష్కరించాలని కోరితే బీజేపీ గాడిద గుడ్డు ఇచ్చిందంటూ కాంగ్రెస్ నేతలు ఇటీవల గాంధీభవన్ వద్ద ప్రదర్శన నిర్వహించిన విషయం సంగతి తెలిసిందే. ఇప్పుడు మేడే సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కూడా బీజేపీపై ట్విట్టర్ వేదికగా సెటైర్లు వేశారు.

.. వివరాలు 2లో






## కేసీఆర్ కార్మిక పక్షపాతి

### కార్మికులను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

### పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం

హైదరాబాద్, మే 01 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మిక పక్షపాతి అని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో కార్మికులకు అండగా నిలిచినట్టే భవిష్యత్‌లోనూ వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటామని కేటీఆర్ భరోసా ఇచ్చారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మే డే వేడుకల్లో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చిరుద్యోగులను కేసీఆర్ మంచిగా

మిగతా 2 లో



## దిశ ఎన్కౌంటర్ లో పోలీసులకు ఊరట

### కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవద్దని హైకోర్టు స్టే

హైదరాబాద్ లో 2019 లో జరిగిన దిశ అత్యాచారం, హత్య ఘటనలో నిందితులను పోలీసులు ఎన్ కౌంటర్ చేసిన ఘటనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ వ్యవహారంలో పోలీసులకు తాజాగా భారీ ఊరట లభించింది. సిర్పూర్ కమిషన్ నివేదిక ఆధారంగా సదరు అధికారులపై చర్యలు తీసుకోవద్దని హైకోర్టు స్టే విధించింది.

హైదరాబాద్, మే 01 (తీన్మార్ న్యూస్): సిర్పూర్కర్ కమిషన్ నివేదికపై హైకోర్టును ఏడుగురు పోలీసు అధికారులు, షాద్ నగర్ తహసిల్దార్ ఆశ్రయించారు. వీళ్ళపై చర్యలు తీసుకోవద్దంటూ తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ్ సేన్ రెడ్డి స్టే విధించారు. దిశా నిందితుల ఎన్ కౌంటర్ పై విచారణ కోసం సిర్పూర్ కమిషన్ ను సుప్రీంకోర్టు నియమించింది. క్షేత్రస్థాయిలో పర్యటించడంతోపాటు పలువురిని సిర్పూర్ కమిషన్ విచారణ చేసింది. దిశా నిందితులను ఎన్ కౌంటర్ చేసిన పోలీసు

మిగతా 2 లో

## పది ఫలితాల సందేహాలను నివృత్తి చేసుకునేందుకు అవకాశం


### రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ ఫీ చెల్లింపుకు చివరి గడువు మే 15

### డిఈఓ కార్యాలయాలల్లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు



హైదరాబాద్, మే 01 (తీన్మార్ న్యూస్) ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాలపై సందేహాలను నివృత్తి చేసేందుకు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు అవకాశం కల్పించామని విద్యా ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం తెలిపారు. రీకౌంటింగ్ కోసం విద్యార్థులు రూ.500 ఫీజు చెల్లించాలి. రీవెరిఫికేషన్, డూప్లికేట్ ప్రశ్నపత్రాల కోసం, ఒక సబ్జెక్టుకు రూ.1000 చెల్లించాలి. నిర్ణీత రుసుమును మే 15లోగా చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. కాగా తెలంగాణలో

మిగతా 2 లో



## కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు రాష్ట్ర హైకోర్టు నోటీసులు జారీ

### బీఆర్ఎస్ నుండి పార్టీ ఫిరాయించిన వారిపై పిర్యాదు

### ఫిరాయించిన వారిపై అనర్హత వేటు వేయాలంటూ ఎమ్మెల్యే కేపీ

తెలంగాణ బ్యూరో, మే 01 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు తెలంగాణ రాష్ట్ర హైకోర్టు నోటీసులు జారీ చేసింది. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి గెలిచి కాంగ్రెస్ పార్టీలో కి వెళ్లిన స్టేషన్ ఘనాపూర్, కడియం శ్రీహరి, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కు హైకోర్టు సమన్లు జారీ చేసింది. ఒక జెండా

మిగతా 2 లో

## ములుగు జిల్లాను తొలగిస్తారనేది దుష్ప్రచారమే

### పార్లమెంట్ ఎన్నికల తర్వాత జిల్లాను అభివృద్ధి చేసుకుందాం

### రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క)

ములుగు, మే 01 (తీన్మార్ న్యూస్): ఏండ్ల తరబడి కొట్లాడి సాధించుకున్న ములుగు జిల్లాను తొలగిస్తారని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, పార్లమెంట్ ఎన్నికల తర్వాత పూర్తిస్థాయిలో జిల్లాను అభివృద్ధి చేసుకుందామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి

మిగతా 2 లో



## ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను ప్రశ్నించిన సుప్రీంకోర్టు

### ఢిల్లీ లిక్కర్ స్కామ్‌కు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు సంబంధం ఏంటి

### ఈడీ అరెస్టు చేయడాన్ని సుప్రీంకోర్టులో కేజ్రీవాల్ సవాల్

న్యూ ఢిల్లీ, మే 01 (తీన్మార్ న్యూస్): ఢిల్లీ లిక్కర్ స్కామ్‌కు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఉన్న సంబంధం ఏమిటని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులను సుప్రీంకోర్టు సూటిగా ప్రశ్నించింది. పైగా సార్వత్రిక ఎన్నికలకు ముందు కేజ్రీవాల్‌ను ఎందుకు అరెస్టు చేశారంటూ మరో ప్రశ్న సంధించింది. ఈడీ తనను అరెస్టు చేయడాన్ని

మిగతా 2 లో





## వాలంటరీ వ్యవస్థను తీసుకువస్తా

### ప్రతీ వాలంటీర్‌కు ప్రతినెల రూ.5వేలు చెల్లిస్తాం

### రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

తన నియోజకవర్గంలో వాలంటరీ వ్యవస్థను తీసుకు వస్తానని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సీఎం జగన్ తీసుకొచ్చిన వాలంటరీ వ్యవస్థను నల్గొండ నియోజకవర్గంలో ఎన్నికల తర్వాత ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు.



నల్లగొండ, మే 01 (తీన్మార్ న్యూస్): ప్రతి గ్రామానికి ఒక వాలంటీర్‌ను ఏర్పాటు చేసి, ఆ వాలంటీర్లకు ప్రతినెల రూ.5వేలు ప్రతిక్ ఫౌండేషన్ ద్వారా చెల్లిస్తామన్నారు. గ్రామ వాలంటీర్లను సమన్వయం

మిగతా 2 లో

# తెలంగాణకు బీజేపీ గాడిద గుడ్డు ఇచ్చింది

**మొదటి పేజీ తరువాయి**

- తెలంగాణ అడిగింది పాలమూరు – రంగారెడ్డికి జాతీయ హెూదా, బీజేపీ ఇచ్చింది.. గాడిద గుడ్డు
- తెలంగాణ అడిగింది రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బీజేపీ ఇచ్చింది.. గాడిద గుడ్డు
- తెలంగాణ అడిగింది బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, బీజేపీ ఇచ్చింది.. గాడిద గుడ్డు
- తెలంగాణ అడిగింది కృష్ణా, గోదావరిలో వాటాల పంపకం, బీజేపీ ఇచ్చింది.. గాడిద గుడ్డు
- తెలంగాణ అడిగింది మేడారం జాతరకు జాతీయహెూదా, బీజేపీ ఇచ్చింది.. గాడిద గుడ్డు
- తెలంగాణ అభివృద్ధికి బీజేపీనే అడ్డు పదేండ్ల మోడీ పాలనలో తెలంగాణకు ఇచ్చింది పెద్ద గాడిద గుడ్డ
- తెలంగాణ అభివృద్ధికి బీజేపీ ఒక్కటే అడ్డంకి అని సీఎం రేవంత్ రెడ్డి సెటైరికల్ గా ట్వీట్ చేశారు. బీజేపీ తెలంగాణకు ఇచ్చింది ఇది అంటూ సీఎం రేవంత్ రెడ్డి తన తలపై ఒక బాక్స్ పెట్టుకుని దానిపై గాడిద గుడ్డు అంటూ అని రాసిన ఫోటోతో ట్వీట్ వైరల్ గా మారింది.

# ములుగు జిల్లాను తొలగిస్తారనేది దుష్ప్రచారమే

**మొదటి పేజీ తరువాయి**

అనసూయ (సీతక్క) స్పష్టం చేశారు. మూడేండ్లుగా అన్నివర్గాల ప్రజలతో కలిసి పోరాటం చేస్తే వచ్చిన జిల్లాను తొలగిస్తారని కొందరు కావాలనే బురద చల్లుతున్నారన్నారు. ములుగు క్యాంపు ఆఫీసులో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో సీతక్క మాట్లాడారు. ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో బీఆర్ఎస్ ప్రజాపాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. మల్లంపల్లి మండలాన్ని కూడా అభివృద్ధి చేసుకుందామన్నారు. మల్లంపల్లి మండలం, ఏటూరునాగారం డివిజన్‌పై గత పాలకులు ఎలాంటి జీవో, గెజిట్ ఇవ్వలేదని, భవిష్యత్తులో తాము ఏర్పాటు చేసి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

# కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు రాష్ట్ర హైకోర్టు నోటీసులు జారీ

**మొదటి పేజీ తరువాయి**

కింద గెలిచి మరో పార్టీలోకి జంప్ అయ్యి పార్టీ ఫిరాయించిన వారిపై అనర్హత వేటు వేయాలంటూ కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు మంగళవారం విచారించింది.

దీంతో కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుతో పాటు ప్రతివాదులైన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయ, శాసనసభ కార్యదర్శి, కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను జూన్ 5కు వాయిదా వేసింది తెలంగాణ హైకోర్టు బీఆర్ఎస్ పిటిషనర్ల తరపు న్యాయవాది గండ్ర మోహన్ రావు వాదనలు వినిపిస్తూ అనర్హత పిటిషన్లపై మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉందని వెల్లడించింది. దీనికి సంబంధించి గతంలో సుప్రీం కోర్టు వెలువరించిన పలు తీర్పులను ప్రస్తావించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల సస్పెన్షన్ పై స్పీకర్ కు ఆదేశాలు జారీ చేసే హక్కు తమకు ఉంటుందని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వానికి.. అసెంబ్లీ స్పీకర్ కార్యాలయానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఇక దీనిపై తదుపరి విచారణను జూన్ 5వ తేదీకి వాయిదా వేసింది. ఇక మరో వైపు ఖైరతాబాద్ బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి పార్టీ మారిన దానం నాగేందర్ పై అనర్హత వేటు వేయాలని హుజూరాబాద్ లోని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే కాగా దీనిపై హైకోర్టు స్పందించి దానం నాగేందర్ నోటీసులు పంపించి విషయం తెలిసిందే.

# పది ఫలితాల సందేహాలను నివృత్తి చేసుకునేందుకు అవకాశం

**మొదటి పేజీ తరువాయి**

10వ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు ఏప్రిల్ 30న విడుదలైన సంగతి తెలిసిందే. విద్యా ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ఫలితాలను విడుదల చేశారు. విద్యార్థులు తమ రూల్ నంబర్ లేదా హాల్ టికెట్ వివరాలను నమోదు చేయడం ద్వారా మార్కుల మెమోను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇంటర్ అడ్మిషన్ల సమయంలో ఈ చిన్న మెమోలు ఉపయోగపడతాయి. ఒరిజినల్ మెమోలను త్వరలోనే ఆయా పాఠశాలలకు పంపనున్నారు. అయితే పదో తరగతి ఫలితాలపై సందేహాలను నివృత్తి చేసేందుకు రీకౌంటింగ్ కోసం విద్యార్థులు రూ.500 ఫీజు చెల్లించాలని, రీవెరిఫికేషన్, డూప్లికేట్ ప్రశ్నపత్రాల కోసం, ఒక సబ్జెక్టుకు రూ.1000 మే 15లోగా చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. ఇక విద్యార్థులు హాల్ టిక్కెట్లతో పాటు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల సంతకంతో కూడిన దరఖాస్తు ఫారాన్ని డీఈవో కార్యాలయానికి పంపాలన్నారు. వీటిని అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్ లో మాత్రమే ఇవ్వాల్సి ఉంటుంది. కొరియర్, పోస్ట్ దరఖాస్తులను స్వీకరించబోమని అధికారులు నిర్ణయించారు. అయితే టెన్త్ ఫెయిల్ అయిన విద్యార్థులకు జూన్ 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. 10వ తరగతి ఫలితాల్లో 99.05 శాతంతో నిర్మల్ జిల్లా ప్రథమ స్థానంలో నిలవగా, 65.10 శాతంతో వికారాబాద్ జిల్లా చివరి స్థానంలో నిలిచింది. 98.65 శాతంతో సిద్దిపేట రెండో స్థానంలో, 98.27 శాతంతో రాజన్న సిరిసిల్ల జిల్లా మూడో స్థానంలో నిలిచాయి.


# వాలంటరీ వ్యవస్థను తీసుకు వస్తా

**మొదటి పేజీ తరువాయి**

చేసేలా మండల స్థాయిలో కూడా వాలంటీర్‌ను నియమిస్తామన్నారు. మున్సిపాలిటీ కేంద్రంలో కూడా ఇదే వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. నిరుపేదకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సంక్షేమ పథకాలన్నీ లబ్దిదారులకు ఇంటికి చేర్చేలా వాలంటీర్లు పనిచేస్తారన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసిన వాళ్లందర్నీ కోఆర్డినేషన్ చేయడానికి నియోజకవర్గంలోని తన క్యాంపు కార్యాలయంలో, సచివాలయంలో తన చాంబర్లో కూడా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయునట్లు తెలిపారు. సామాన్య కార్యకర్తగా ఉన్న తనను ఈ స్థాయికి తీసుకొచ్చిన మీ అందరి రుణం తీర్చుకునే ప్రయత్నం చేస్తానన్నారు.


# ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను ప్రశ్నించిన సుప్రీంకోర్టు

**మొదటి పేజీ తరువాయి**



కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సంజీవ్ ఖన్నా విచారించారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. జ్యూడీషియల్ ప్రొసీడింగ్స్ లేకుండానే మీరు క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను ప్రారంభించవచ్చా అని ప్రశ్నించారు. పైగా ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో ఇంత వరకు ఒక్క అటాచ్‌మెంట్ చర్య కూడా తీసుకోలేదని, ఒకవేళ అటాచ్‌మెంట్ జరిగివుంటే కేసుతో కేజ్రీవాల్‌కు ఉన్న సంబంధం ఏంటో చూపెట్టాలని న్యాయమూర్తి కోరారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు కేజ్రీవాల్‌ను ఎందుకు అరెస్టు చేశారో చెప్పాలంటూ అడిగారు. ఇదిలావుంటే, ఈ కేసులో ఇంతవరకు కేజ్రీవాల్‌కు ఉన్న సంబంధాన్ని ఈడీ వెలికితీయలేకపోవడం గమనార్హం. కాగా, సుప్రీంకోర్టు అడిగిన ప్రశ్నలకు ఈడీ ఈ నెల 3వ తేదీన సమాధానం ఇవ్వనుంది.

# ఎండ కర్ఫ్యూ



**మొదటి పేజీ తరువాయి**

పడుతున్నారు. ఉదయం ఏడు గంటల నుంచే తెలంగాణలో ఎండతీవ్రత ఎక్కువగా ఉంది. ప్రజలు బయటకు రావడానికే భయపడిపోతున్నారు. ఎండల తీవ్రత ఎలా ఉందంటే. నడిరోడ్డు మీద దోసె వేసేటంత స్థాయిలో ఎండల తీవ్రత ఉందంటే ఆశ్యర్యపోక తప్పదు.

**వందేళ్లలో ఎన్నడూ లేని విధంగా**

గత వందేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఎండల తీవ్రత ఈ ఏడాది ఎక్కువగా ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. రహదారులన్నీ ఉదయం నుంచే బోసి పోయి కన్పిస్తున్నాయి. కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. హైదరాబాద్ నగరంలో రోడ్లన్నీ ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. సాయంత్రం నాలుగు గంటలు దాటిన తర్వాత మాత్రమే ప్రజలు బయటకు వచ్చేందుకు ఇష్టపడుతున్నారు. చిరు వ్యాపారులు కూడా ఉదయం ఆరు గంటలకే తమ దుకాణాలను తెరుస్తున్నారు. ఎవరైనా నిత్యావసర వస్తువులు, కూరగాయలు కొనుగోలు చేయాలంటే ఉదయం ఏడు గంటల లోపే బయటకు వచ్చి వెళుతున్నారని, అందుకే తాము కూడా వేళలను మార్చుకున్నామని తెలిపారు.రాత్రి పూట కూడా రాత్రి పూట కూడా ఉక్కపోత వీడటం లేదు. వేడి గాలులతో అనేక మంది ఇబ్బంది పడుతున్నారు. మే నెల గడిచేదెట్లా? అని ఆందోళన చెందుతున్నారు. అనేక మంది ఇప్పటికే వడదెబ్బ తగిలి ఆసుపత్రి పాలయ్యారు. మరికొందరు ఇంట్లోనే చికిత్స పొందుతున్నారు. తీవ్రమైన జ్వరంతో పాటు ఒళు నొప్పులు కూడా ఉంటుండటంతో వైద్యులను సంప్రదిస్తున్నారు. డీహైడ్రేషన్ కు గురి కాకుండా నీరు ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు కూడా సూచిస్తున్నారు. మే నెలలోకి ఎంటర్ అవడంతో ఎండలు మరింత ముందిరే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. అవసరమైతే తప్ప బయటకు ఎవరూ రావద్దని కూడా హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

# అదానీ, అంబానీలకు కోట్ల రుణాలను బీజేపీ మాఫీ చేసింది

**బీజేపీ చేయలేదని నిరూపిస్తే రాజీనామా చేస్తా**

**ప్రధాని మోదీ పై కేటీఆర్ ఆరోపణలు**



హైదరాబాద్, మే 01 (తీన్మార్ న్యూస్): బడా కార్పొరేట్లు అయినా అదానీ, అంబానీలకు పద్నాలుగున్నర లక్షల కోట్ల రుణాలను మోదీ మాఫీ చేయలేదని ఇదే బండి సంజయ్, కిషన్ రెడ్డి రుజువు చేస్తే రేపే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. మే డే సందర్భంగా తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మాట్లాడారు. 2019 మార్చిలో కరోనా వచ్చింది. అప్పుడు దేశమంతా అల్లకల్లోలం. రవాణా సౌకర్యాలు స్తంభించిపోయిన పరిస్థితి. పిల్లలను ఎత్తుకుని, సూట్ కేసుల మీద పిల్లలను కూర్చోబెట్టుకొని హైవేల మీద వెళ్లిన పరిస్థితి. ఆ రోజులు మరిచిపోవద్దు. అప్పుడప్పుడు మరిచిపోయి లంగలకు ఓట్లు వేస్తే మన నెత్తి మీద కూర్చుంటారు. ఆనాడు మోదీ కార్మికులను పట్టించుకోలేదు. రైళ్లు, బస్సులు పెట్టమంటే చలనం లేదు. హృదయం లేని మనిషి నరేంద్ర మోదీ. కార్మికులను, కర్షకులను మోదీ చావగొట్టిండు అని కేటీఆర్ పేర్కొన్నారు. మన దేశంలో పెట్రోల్, డీజిల్ దొరకదు. ముడి చమురును తీసుకొచ్చి ప్రాసెస్ చేసి అమ్ముతుంటారు. అయితే 2014లో నరేంద్ర మోదీ ప్రధాని అయినప్పుడు ముడి చమురు బ్యారెల్ ధర 100 డాలర్లు.. ఇవాళ 84 డాలర్లు. ముడి చమురు ధర తగ్గితే పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గాలి కదా..? మోదీ దేవుడు కాబట్టి పెరిగినవి. డీజిల్, ప్రెటల్‌పై రాష్ట్రంలో పన్ను పెంచలేదు. సెస్‌ల పేరు మీద సుంకాలు వేసి పెట్రోల్, డీజిల్ ధర పెంచిండు మోదీ. ఈ పదేండ్లలో సెస్‌ల పేరు మీద 30 లక్షల కోట్లు వసూళ్లు చేశాడు మోదీ. ప్రతి రోజు సుంకం కడుతున్నాం. జాతీయ రహదారుల కోసం సెస్ పెట్టామని కేంద్రం చెబుతోంది. కానీ ప్రతి జాతీయ రహదారిపై టోల్ వసూళ్లు చేస్తున్నారు. ఒక దిక్కు టోల్.. ఇంకో దిక్కు సెస్‌లు గుంజుతున్నారు. మరి రూ. 30 లక్షల కోట్ల గురించి నిలదీస్తే వాస్తవం బయటపడింది. వీటిలో బడా కార్పొరేట్లు అయినా అదానీ, అంబానీలకు పద్నాలుగున్నర లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసిండు మోదీ. నేను చెప్పేది తప్పని బండి సంజయ్, కిషన్ రెడ్డి రుజువు చేస్తే రేపు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని కేటీఆర్ సవాల్ విసిరారు.

# అయోధ్య రాముడిని దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**శ్రీరాముడికి ప్రత్యేక పూజలు**



అయోధ్య, మే 01 (తీన్మార్ న్యూస్): అయోధ్యలో కొలువు తీరిన శ్రీరాముడిని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం దర్శించుకున్నారు. ఆ క్రమంలో శ్రీరాముడికి ఆమె ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో రాష్ట్రపతి ముర్మ అయోధ్య ఎయిర్ పోర్ట్‌కు చేరుకున్నారు.

ఆమెకు యూపీ గవర్నర్ అనందిబెన్ పటేల్, రాష్ట్ర మంత్రి సూర్య ప్రతాప్ షాహి స్వాగతం పలికారు. అనంతరం ఎయిర్‌పోర్ట్ నుంచి నేరుగా అయోధ్యలోని హనుమాన్ ఘూరీ దేవాలయాన్ని వెళ్లి హనుమంతుని దర్శించుకున్నారు. అనంతరం అయోధ్యలోని రామ మందిరానికి వెళ్లారు. అయితే సాయంత్రం సూర్య మహా హారతి కార్యక్రమంలో ద్రౌపది ముర్ము పాల్గొంటారు. అనంతరం ముర్ము తిరిగి ఢిల్లీకి పయనమవుతారు. అయితే అయోధ్యకి వెళ్లిన భారత రాష్ట్రపతుల్లో ముర్ము మూడో వారు. అయోధ్యకు వెళ్లిన తొలి రాష్ట్రపతి జ్ఞానీ జైలు సింగ్. 1983లో భారత రాష్ట్రపతిగా జ్ఞానీ జైలు సింగ్ అయోధ్యకు వెళ్లారు. స్థానిక హనుమాన్ ఘూరీ దేవాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక రెండో రాష్ట్రపతి రామనాథ్ కోవింద్. 2021లో ఆయన అయోధ్యలోని రామ్ లల్లాలో రామనాథ్ కోవింద్ సందర్శించుకొని ప్రార్థనలు చేశారు. ఇక అయోధ్యను సందర్శించిన మూడో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.

# దేశంలో రిజర్వేషన్లు తీసేయాలని బీజేపీ కుట్ర చేస్తుంది

**సంబంధించిన పూర్తి ఆధారాలు నా దగ్గర ఉన్నాయ్**

**కోరుట్ల జనజాతర సభలో రేవంత్ రెడ్డి ఆరోపణలు**





తెలంగాణ బ్యూరో, మే 01 (తీన్మార్ న్యూస్): దేశంలో రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు కుట్ర జరుగుతుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి ఆధారాలు తన దగ్గర ఉన్నాయని సాయంత్రం 4 గంటలకు ప్రెస్ మీట్ పెట్టి తెలిపారు. దేశంలో బీజేపీ రిజర్వేషన్లు తీసేయాలని కుట్ర చేస్తుందని ఆరోపించారు. కుల గణనకు మోదీ ఒప్పుకోలేదని కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీ కులగణన చేస్తామని రాహుల్ గాంధీ చెప్పారని తెలిపారు. దేశ సంపదను మోదీ, అదానీ, అంబానీలకు దోచి పెట్టారని ఆరోపించారు. కోరుట్లలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ జనజాతర సభలో రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ మైనారిటీలకు కాంగ్రెస్ న్యాయం చేయాలని చూస్తుందని తెలిపారు. రాజ్యాంగాన్ని మార్చేందుకే బీజేపీ 400 వందల సీట్లు అంటుందని ఆరోపించారు. ప్రశ్నించినందుకు తనపై మోదీ అమిత్ షా కుట్ర చేశారని చెప్పారు. ఢిల్లీలో కేంద్ర హెూం శాఖ తనపై కేసు పెట్టిందని తెలిపారు. ఈడీ, సీబీఐతో పాటు ఢిల్లీ పోలీసులు తమని బయపెట్టాలని చూస్తున్నారని, గతంలో కేసీఆర్ నూ ఇలాగే బయపడితే జనం బుద్ధి చెప్పారని అన్నారు. ఢిల్లీలో పోలీసులు, సీబీఐ ఉండొచ్చని తన దగ్గర 4 కోట్ల మంది ప్రజలు ఉన్నారని తెలిపారు.

తనను అరెస్టు చేయడానికి మీకు పీఎం పదవి ఇచ్చారా అని ప్రశ్నించారు. మొదటి సారి సీఎం అయ్యాను పీఎంకు గౌరవం ఇస్తానని వెల్లడించారు. మెట్రో రైలు, మూసీ ప్రక్షాలనకు నిధులు ఇవ్వండని అడిగితే అణా పైసా ఇవ్వలేదని, హైదరాబాద్ కు కృష్ణా జలాలు అధనంగా అడిగితే ఇయ్యలేదని విమర్శించారు. పార్లమెంట్ లో మోదీ తెలంగాణను అవమానించారని అన్నారు సీఎం రేవంత్ రెడ్డి.

# కేసీఆర్ కార్మిక పక్షపాతి

**మొదటి పేజీ తరువాయి**

చూసుకున్నాడు. 20,455 వీఆర్ఏలను క్రమబద్ధీకరించాం. 25 వేల ఔట్ సోర్సింగ్ విద్యుత్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాం. 5 వేల మంది పీఏసీఎస్ ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీని అమలు చేసింది కేసీఆర్. 3,974 మంది సెర్ప్ ఉద్యోగులకు పే స్కేల్ అమలు చేశారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసింది కేసీఆర్ ప్రభుత్వం. మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా నియమించారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పీఆర్సీ వర్తింపజేశారు. సింగరేణి లాభాల్లో 20 శాతం వాటా కార్మికులకు ఉండేది. కానీ కేసీఆర్ వచ్చిన తర్వాత లాభాల్లో 32 శాతం వాటా ఇచ్చారు. అంతేకాకుండా అంగన్‌వాడీ టీచర్లకు, ఆశా వర్కర్లకు, సెర్ప్ ఉద్యోగులకు, జీహెచ్ఎంసీలో పారిశుధ్య కార్మికులకు కేసీఆర్ జీతాలు పెంచారని కేటీఆర్ గుర్తు చేశారు. ఇదే మోదీ రైతుల ఆదాయం డబుల్ చేస్తాన్నాడు. కానీ చేయలేదు. ప్రపంచ కుబేరుల జాబితాలో 2014లో 609వ స్థానంలో ఉన్న అదానీ ఇప్పుడు 2వ స్థానానికి ఎగబాకిండు. ఆయన సంపద లక్షల రెట్లు పెరిగింది. దీనికి కారణం మోదీనే. కార్పొరేట్లను పట్టించుకున్నడు కానీ కార్మికులకు మోదీ, ఆయన ప్రభుత్వం చేసిందేమీ లేదు. ఏం చేశారో చెప్పే దమ్ము కూడా ఆ నేతలకు లేదు. గట్టిగా మాట్లాడితే జై శ్రీరాం అంటరు. దేవుడిని అడ్డం పెట్టుకుని రాజకీయం చేయడం తగదు. శ్రీరాముడు అందరివాడు. లంగలకు, దొంగలకుఓట్లు వేయమని శ్రీరాముడు చెప్పలేదు. ప్రతిపక్షంలో ఉన్నాం కాబట్టి ప్రజల తరపున పోరాటం చేస్తాం. ఎంపీ ఎన్నికల్లో సామాజిక న్యాయం పాటించాం. ఈ ఎన్నికల్లో 12 సీట్లు గెలిపిస్తే రాబోయే సంవత్సర కాలంలో తెలంగాణ రాజకీయాలను కేసీఆర్ శాసిస్తారని, మళ్లీ తెలంగాణలో గులాబీ జెండా ఎగరబోతదని కేటీఆర్ అన్నారు.

# దిశ ఎన్కౌంటర్‌లో పోలీసులకు ఊరట

**మొదటి పేజీ తరువాయి**

అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిర్పూర్ కమిషన్ సూచించింది. అయితే, సిర్పూర్ కమిషన్ నివేదిక సరిగ్గా లేదని హైకోర్టులో పోలీసు అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా హైకోర్టు పోలీసులకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది.

**సామూహిక అత్యాచారం, హత్య**

దిశ అనే 26 ఏళ్ల పశువైద్యురాలిని నలుగురు యువకులు సామూహిక అత్యాచారం చేసి, హత్య చేసిన సంగతి తెలిసిందే. 2019 నవంబరు 28 ఉదయం దిశ శవాన్ని గుర్తించారు. షాద్ నగర్ లోని చేతనపల్లి బ్రిడ్జి సమీపంలో దహనం చేసిన శవం లభ్యం అయింది. అంతకుముందు రోజు రాత్రి ఆమె సమీపంలోని టోల్ గేట్ సమీపంలో ఒంటరిగా ఉండగా.. లారీలో వచ్చిన నిందితులు ఆమెను కిడ్నాప్ చేసి అత్యాచారం చేశారు. అనంతరం ఆమెను సజీవ దహనం చేశారు. ఈ ఘటన అప్పట్లో విపరీతంగా దేశ వ్యాప్తంగా సంచలనం అయింది. నిందితులను శిక్షించాలని ప్రజల నుంచి తీవ్రమైన డిమాండ్ లు తెరపైకి వచ్చాయి. అనంతరం విచారణలో భాగంగా సైబరాబాద్ పోలీసులు నిందితులతో సీన్ రీక్రియేట్ చేస్తుండగా.. నలుగురు తప్పించుకునేందుకు ప్రయత్నించారు. పోలీసులపై దాడి చేసి పారిపోయే క్రమంలో వారిని ఎన్ కౌంటర్ చేసినట్లుగా పోలీసులు తెలిపారు. ఈ ఎన్ కౌంటర్ ఘటనపై మానవహక్కుల పోరాటదారులు నిరసనలు వ్యక్తం చేశారు. నిందితులను చట్ట ప్రకారం శిక్షించాలని.. పోలీసులు చట్టాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారని విమర్శలు వచ్చాయి.

# కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న అసంతృప్తుల పర్వం

**కాంగ్రెస్ పార్టీలో తలనొప్పిగా మారిన చేరికలు**

**వరంగల్ ఎంపి అభ్యర్థి ముందే కార్యకర్తలు రసాభాస**

**మధ్యలోనే వెళ్లిపోయిన కడియం కావ్య**



వరంగల్, మే 01 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తుల పర్వం కొనసాగుతూనే ఉంది. అసలే వర్గపోరుతో కొట్లాడుకునే కాంగ్రెస్ పార్టీలో చేరికలు మరో తలనొప్పిగా మారాయి. ఇతర పార్టీల నుంచి కొత్తగా కాంగ్రెస్‌లో చేరుతుం డటంతో ఆ పార్టీ క్యాడర్‌లో అస్పృంతృప్తికి కారణమవుతున్నాయి. తాజాగా వరంగల్ జిల్లా కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రసాభాస చోటు చేసుకుంది. వరంగల్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య ముందే కాంగ్రెస్ కార్యకర్తలు కొట్టుకున్నారు. కొత్తగా కాంగ్రెస్‌లోకి వచ్చిన కార్యకర్తలకు ప్రాధాన్యత ఇస్తున్నారంటూ మొదలైన గొడవ.. చిలికి చిలికి గాలివానలా మొదలయింది. కొత్తగా పార్టీలో చేరిన కార్యకర్తలు, పాత కార్యకర్తలుగా రెండు వర్గాలుగా విడిపోయి పరస్పరం కొట్టుకున్నారు. గొడవ ఎంతకు సద్దుమణగక పోవడంతో కడియం కావ్య మధ్యలోనే వెళ్లిపోవాల్సి వచ్చింది.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# అబద్ధాలపై అబద్ధాల పోటీ

ఎన్నికలలో ప్రజలను నమ్మించేందుకు అన్ని పార్టీలు కూడా ఒక మేరమితి మీరిన వాగ్ధానాలు చేయటం, పరస్పర ఆరోపణలు చేసుకోవటం ఎప్పుడూ ఉన్నదే. కాని మనం ఈసారి చూస్తున్నంతగా అబద్ధాలు, పరస్పర దూషణలు గతంలో ఎన్నడూ లేవు. ఇపుడు ఏ రోజు పత్రికలు చూసినా, టీవీలు, యూట్యాబ్‌లు చూసినా కొద్దిసేపైనా కాకుండా మనకు అలసట కలిగి తల తిరిగి పోతున్నది. పోటీ జరిగేది పార్టీలు, అభ్యర్థుల మధ్యనా లేక ఇరువురి అబద్ధాల మధ్యనా అనే సందేహం కలుగుతున్నది. అన్ని పార్టీలు తమ మేనిఫెస్టోలను ప్రకటించినపుడు ఆ విషయమై ప్రజల వద్ద ప్రచారాలు చేసుకోవాలి. కాని ఆ పని తగ్గుతూ అబద్ధాలు, ఆరోపణలు, చివరకు ఎన్నడూ లేని విధంగా వ్యక్తిగత దూషణలు పెరుగుతున్నాయి. వారిని ఇందుకు పురికొల్పుతున్నది ఏమై ఉంటుంది? ఒక ప్రజాస్వామిక వ్యవస్థలో ఎందుకీ పతనాలు? ఆలోచించినా మీదట ప్రధానంగా రెండు కారణాలు కనిపిస్తున్నాయి. ఒకటి, పార్టీలపై, అభ్యర్థులు రాజకీయంపై, ఒక వేళ అధికార పక్షాలు అయినట్లయితే వారు తమ పాలనా కాలంలో చేసిన మంచిపట్ల ప్రజలకు విశ్వాసాలు తగ్గుతున్నాయి. అయినప్పటికీ అధికారం కోసం గెలవక తప్పదు. అది జరగాలంటే ప్రజలను తమ ఘనత గురించి, లేదా తమ అబద్ధాలతో, లేదా ప్రత్యర్థులపైన ఆరోపణలతో ఏదో ఒక విధంగా మెప్పించాలి. ఆ విధంగా తమ స్వంత వైఫల్యాలను, బలహీనతలను ప్రజల దృష్టిలో మరుగునపడేట్లు చేయాలి. వైఫల్యాలు, లోపాలు ఎంత ఉంటే తమ పట్ల ప్రజలకు ఎంత అపనమ్మకం ఉందనుకుంటే అంతగా, వాటిని మరపింపజేసేందుకు, ప్రజల దృష్టిని పక్క దారి పట్టించేందుకు, తమ అబద్ధాలు, ఆరోపణలు, దూషనలతో అంత హంగామా సృష్టించాలి. దీనిని పొగబాంబుల ప్రచారం అనవచ్చునేమో. ఇద్దరూ పొగబాంబులు విసురు తారు. ఉక్కిరి బిక్కిరియేది ప్రజలు, ప్రజాస్వామ్యం. ఇది ఒకటి కాగా, రెండవది పార్టీలు ఏవి అయినపుటికీ అభ్యర్థులుగా వ్యక్తులు స్థాయి, సంస్కృతి, సంస్కారం, నాగరికత, ప్రజాస్వామిక విలువలు పతనమవుతుండటం. మరొక వైపు అధికారం పట్ల , సంపదలను పోగుచేసుకోవడం పట్ల దాహం పెరుగుతుండటం. ఈ విధంగా పైన చెప్పుకున్న మొదటి కారణం, ఈరెండవ కారణం కలగలిసినపుడు మనకు ఈ విధమైన ధోరణులే కనపిస్తాయి. అవి ఎన్నికలు ప్రచారాలు కావచ్చు, మరొకటి కావచ్చు. అసందర్భం కాదనుకుంటే మరొకటి కూడా చెప్పాలి. అది పార్టీల మార్పిడి. ప్రస్తుతం మనం చూస్తున్న స్థాయిలో గాని, ఆపద్ధతిలో ఎపుడు ఎటుపోతారో ఊహించలేకపోవటంగాని పార్టీ మార్పిడులు లోగడ ఎప్పుడూ లేవు. ఇందుకు ఏకైక కారణం పదవీ దాహం, ధన దాహం, విలువల పతనమనేది స్పష్టం. ఈ సందర్భంలో అర్థం చేసుకోవలసింది మరొకటి ఉంది. ఈ విధమైన పరిణామాలకు మూలాలు రెండింటిలో ఉన్నాయి. ఒకటి, మనకు స్వాతంత్రం లభించినప్పటి నుంచి పాలించిన పార్టీలు గాని, తర్వాత ఉనికిలోకి వచ్చిన ప్రాంతీయ పార్టీలు, కులపార్టీలు, వేర్వేరు సిద్ధాంతాల పార్టీల గాని క్రమంగా తమ పరిపాలనలో విఫలమవుతూ వచ్చాయి. మరొక స్థాయిలో తమ సిద్ధాంతాలకు దూరమవుతూ వచ్చాయి. ఆ విధంగా ప్రజలకు దూరమవటం, బలహీనపడటం జరిగింది. కాంగ్రెస్‌తో సహా అవన్నీ చెల్లా చెదురుకావటం మొదలైంది. ఒకవైపు ఈ క్రమం జరుగుతుండగా మరొకవైపు 1990 ప్రాంతంలో ఆర్థిక సంస్కరణలు అనే పెను తుఫాను ఒకటి మొదలైంది. అది వ్యక్తులు, నాయకులు, పార్టీలు సంస్థల ప్రాపంచిక దృక్పథాన్ని గణనీయంగా ప్రభావితం చేయసాగింది. దాని పర్యవసానంగా వ్యక్తుల జీవిత లక్షాలు, కోరికలు, మానసికతలు, ప్రవర్తనలు కూడా వారికి తెలిసి కొంత, తెలియకనే కొంత మారంటం, వారు తమ వెనుకటి ఆలోచనలను, సిద్ధాంతాలను మార్చుకుని సరికొత్త మార్గాలలోకి వెళ్లటం మొదలైంది. అపుడిక ఎవరు, ఎప్పుడు ఎక్కడ ఉంటారో,అక్కడ ఉండేది ఎంత కాలమో ఎవరికీ, తెలియని పరిస్థితి ఒకటి క్రమంగా రూపు తీసుకున్నది. ఇందుకు దోహదం చేసిన మరొక ముఖ్యమైన పరిణామం బాబ్రీ మసీదును కేంద్రంగా చేసుకుని సాగిన రాజకీయం. అది ఆర్థిక సంస్కరణల కన్నాముందే మొదలై, అప్పటి నుంచి మూడు దశాబ్ధాలు గడిచిన తర్వాత కూడా నేటికీ కొనసాగుతున్నది. ఆర్థికంపై పరిపాలనపై దాని నికరమైన ప్రభావం ఏమున్నా లేకపోయినా, రాజకీయాలపై, సమాజంపై పెనుమార్పులను తెచ్చిపెట్టింది. ఆ మార్పులు కాంగ్రెస్‌తో సహా ఇతర పార్టీలన్నింటిపై కనిపించాయి. చివరకు వామపక్షాలపై కూడా. వారు వరుసగా 34 సంవత్సరాలు పాలించిన బెంగాల్‌లో, తమ అధికారం పోగానే తమ శ్రేణులు పెద్ద ఎత్తున బిజెపిలోకి వెళ్లటం ఇందుకు తార్కాణం. అందువల్ల ఈ పరిణామాలన్నింటి ప్రభావాలు కూడా వ్యక్తులపై, పార్టీలపై పడటానికి, ప్రస్తుతం మనం చర్చిస్తున్న విధంగా ఇతర పార్టీలు బలహీన పడటానికి, విలువల పతనానికి, పార్టీల విచ్ఛిన్నతలకు సంబంధం ఉంది. ఈ రోజున అందరూ రాజకీయాధికార సాధన, ధన సంపాదనలన్నదే ఏకైక ధ్యేయంగా మారి, ఈ విధంగా అబద్ధాలు, ఆరోపణలు దూషణలు చేసుకోవటానికి మూలాలు ఇంత వరకు చెప్పకున్న వాటిలో ఉన్నాయి. మనమంతా చిన్నపుడు చీమా చీమా ఎందుకు కుట్టావనే కథ చదువుకున్నాము. అది, పసిపాపను ఒక చీమ కుట్టటంతో మొదలై వెనుకకు పోతూపోతూ, నా బంగారు పుట్టలో వేలు పెడితే కుట్టనా అని ఆ చీమ ప్రశ్నించే వరకు వెళుతుంది. ఈ అబద్ధాలు, ఆరోపణలు, దూషణల కథ కూడా అంతే. ఇదంతా అంతిమంగా భారతదేశం, ప్రజలు, ప్రజాస్వామ్యం చేసుకున్న దురదృష్టంగా తేలుతుంది. మనకు మొత్తం ప్రపంచంలోనే మహత్తరమైన ఉద్యమాలు, పోరాటాల, త్యాగాల ఫలితంగా వలస పాలన నుంచి స్వాతంత్రం లభించింది. ఆ ఉద్యమానికి నాయకత్వం వహించిన వారు ఈ సువిశాల దేశంలోని అన్ని ప్రాంతాలను, అన్ని వర్గాల ప్రజలను ఉద్యమంలో భాగస్వాములను చేసారు. అన్ని ప్రాంతాలు, అందరు ప్రజల ఆకాంక్షలను, భవిష్యత్ స్వప్నాలను ప్రతి ఫలిస్తూ ప్రపంచంలోనే అత్యుత్తమైన

# మే -డే స్ఫూర్తితో కార్మిక హక్కుల సాధనకు, ప్రతిన బూనుదాం

**– పోకల వెంకటేశ్వర్లు సిపిఐ మండల కార్యదర్శి**
**– త్రిపురం సుధాకర్ రెడ్డి ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి**
**– యడవల్లి వెంకటేశ్వర్లు భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు**



గరిడేపల్లి, మే 01(తీన్మార్ న్యూస్): ప్రపంచ కార్మిక ఉద్యమ చరిత్రలో మే/డే అత్యంత ప్రాధాన్యత కలిగిన రోజని పని గంటల తగ్గింపు కోసం, శ్రమ కు తగిన వేతనం కోసం, కార్మిక వర్గం మొత్తం ఏకమై పెట్టుబడిదారీ వర్గం మీద తిరుగుబాటు చేసిన రోజు మే డే అని సిపిఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి త్రిపురం సుధాకర్ రెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు యడవల్లి వెంకటేశ్వర్లు అన్నారు. గరిడేపల్లి మండల కేంద్రం లో సిపిఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మే డే ఉత్సవాలను ఈ రోజు ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు యడవల్లి వెంకటేశ్వర్లు ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల కేంద్రం లో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎనిమిది గంటల పని దినాన్ని సాధించుకున్న 138 సంవత్సరాల తర్వాత మేడే పోరాట స్ఫూర్తిని కాలరాస్తున్న పాలకులతో మళ్ళీ పోరాడవలసి వస్తున్నదని, దేశంలోని ప్రజల సంపదగా చూపబడుతున్న పబ్లిక్ రంగ సంస్థలను లాభాలతో నడుస్తున్న సంస్థలను, తనకు అనుకూలంగా వున్న అంబానీ, అదాని లాంటి పెట్టుబడిదారులకు మోడీ ప్రభుత్వం తెగ నమ్ముతున్నదని ఆయన అన్నారు. కార్మికులు తమ హక్కుల కోసం పోరాడకుండా 27 కార్మిక చట్టాలను, నాలుగు లేబరు కోడులుగా క్రోడీకరించిందని, కార్మిక సంఘాల ఉనికినే లేకుండా చేయాలని చూస్తున్న కేంద్రం లో అధికారంలో వున్న నరేంద్రమోడీ ప్రభుత్వం కార్మికులను కూడా మతాల పేరుతో వారిని కూడా విభజించి కార్మికులు తమ హక్కుల కోసం పోరాడకుండా మతం మత్తును చల్లుతోందని ఆయన అన్నారు. మే డే స్ఫూర్తితో కార్మికులు తమ హక్కుల సాధనకు పునరంకితం కావాలని ఆయన కార్మికులను ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమం లోసిపిఐ మండల కార్యవర్గ సభ్యులు యడ్ల అంజిరెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల నాయకులు షేక్ మస్తాన్, కీసర నాగయ్య, ఉపాధ్యక్షులు తిరపయ్య, కార్యదర్శి ఆనందరావు, నేమిలి వీరయ్య, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు బెజ్జం రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తాళ్ల తిరపయ్య, ప్రతాని సైదులు, ప్రాథమిక సహకార సంఘం ఉద్యోగుల నాయకులు యడవల్లి వెంకటేశ్వర్లు, ఉల్లెందుల సాయి నందిపాటి వినోద్, మాచర్ల రవి, బాజోజి అప్పాచారీ, చింతలపాటి శ్రీను, తిరపయ్య, దిడ్డి రమణమ్మ, నకిరేకంటి రవి, శ్రీను, ఇంజమూరి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే



నేరేడుచర్ల, మే 01(తీన్మార్ న్యూస్): ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే నేరేడుచర్ల పట్టణ కేంద్రంలో మరియు మండల కేంద్రం కల్లూరు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పారేపల్లి శేఖర్ రావు, భవన నిర్మాణ కార్మిక సంఘం భవనంలో అధ్యక్షులు యారవ శ్రీను, పట్టణ కేంద్రంలోని సిఐటియు జెండాను సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి కొదమగుండ్ల నగేష్ నేరేడుచర్ల , మండలం మరియు గ్రామాలలో గ్రామంలో సిపిఎం మండల కార్యదర్శి సిరికొండ శ్రీను సిఐటియు జెండాలను ఎగురవేశారు. అనంతరం సిఐటియు మండల కన్వీనర్ నీలా, రామ్మూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పారేపల్లి శేఖర్ రావు మాట్లాడుతూ కార్మిక హక్కులను కాలరాయాలనుకున్న,

మతోన్మాద కార్పొరేట్ బిజెపికి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కార్మికులు, రైతులు, నిరుద్యోగులు, ఉపాధ్యాయులు, మహిళలు బుద్ధి చెప్పాలని, కార్మికుల పక్షాన నిలబడే వారికి, కార్మికుల హక్కులను కాపాడే వారిని ఎంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ, హమాలీ, మిల్లు డ్రైవర్స్, ఆటో యూనియన్, తోపుడు బండ్ల యూనియన్, గ్రామీణ హమాలీ, వేర్హౌస్ కార్మికులు మరియు రైతు సంఘం నాయకులు పాతూరి శ్రీనివాసరావు, అనగంటి మీనయ్య, వాసా సంపత్, ఎడ్ల సైదులు, మఠ్రి నాగేశ్వరరావు, మొగిలిచర్ల రుద్రమ్మ, కృష్ణవేణి, సత్తార్, కరిముల్లా, కోదాటి సైదులు, గుర్రం ఏసు, జొన్నలగడ్డ వెంకన్న, సట్టు వెంకన్న, కోటయ్య, బంకు శీను బుడిగ ధనుంజయ గౌడ్, పర్సనబోయిన సైదులు, సిరికొండ శ్రీనివాసు, ఉప్పెల్లి ముత్యాలు, సిరికొండ రాము, పల్లె శ్రీను, ఉప్పెల్లి వెంకటయ్య, చిన్న శీను, కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించిన మెపా రాష్ట్ర కమిటీ

### ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షులు దేవేందర్ ముదిరాజ్



హన్మకొండ, మే 01 (తీన్మార్ న్యూస్): మెపా ( ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ) ఆధ్వర్యంలో 5 నుండి 10వ తరగతి చదువుతున్న నిరుపేద పిల్లలకు గణితం, ఆగ్లంలో ఉచిత శిక్షణ తరగతులను హనుమకొండ నక్కలగుట్టలోని వివేకానంద పాఠశాలలో మెపా రాష్ట్ర కమిటీ సభ్యులు హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మెపా తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మెపా



లక్ష్యంలో భాగం అయిన విద్య ఉద్యోగ సాధికారత దిశగా ఈ ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని, పేద పిల్లలే ఈ తరగతులకు హాజరు అయ్యారని,ఈ కార్యక్రమానికి సహకరించి, స్థలం ఏర్పాటు చేసిన వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ పాక వెంకటేశ్వర్లుకి,గణితం బోధించిన కుక్కల శ్రీనివాస్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెపా రాష్ట్ర నాయకులు నీరటి రాజు, సింగారపు రామ కృష్ణ, దండు చిరంజీవి, కుక్కల శ్రీనివాస్ లతో పాటు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు

**– రైతులు విత్తనాల విషయంలో మోసపోవద్దు**
**– మండల వ్యవసాయ అధికారి ఎస్.పద్మజ**



రామన్నపేట, మే 01(తీన్మార్ న్యూస్): నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని, రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో అన్ని వివరాలు తెలుసుకుని పరిశీలించిన తర్వాతనే కొనుగోలు చేయాలని రామన్నపేట మండల వ్యవసాయ అధికారి ఎస్.పద్మజ అన్నారు. బుదవారం నాడు మండలంలోని డీలరు షాపుల ను వ్యవసాయాధికారి ఎస్.పద్మజ ఎఫ్ఐవిఈఎస్ అప్ ద్వార పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ప్రతి సంవత్సరము నకిలీ పత్తి విత్తనాలు కొనుగోలు చేసి రైతులు నష్టపోతున్నారు. ముఖ్యంగా విత్తనాలు గ్రామాలలో ప్రైవేటు దళారుల వద్ద రేటు తక్కువ అని లూజు విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. అవి నకిలీ విత్తనాలని పూత, కాత దశ వచ్చే వరకు తెలియదు. అప్పుడు తెలిసినా ప్రయోజనం ఉండదు. అందుకే రైతులు అందరూ ప్రతి రైతు వరి, పత్తి విత్తనం కొనేటపుడు తప్పని సరిగా బిల్లు తీసుకోవాలి. బిల్లు మీద అన్ని వివరాలు సరిగా ఉన్నాయో లేదా చూసుకోవాలి. బిల్లును, విత్తన కవర్లను జాగ్రత్త పరచు కోవాలని, గ్రామాలలో ఎవరైనా లైసెన్సు లేకుండా విత్తనాలు అమ్మినచో వ్యవసాయ శాఖాధికారులకు తెలియజేయలని, అనుమతులు లేకుండా అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# పది ఫలితాల్లో టాపర్స్ కు అభినందనల వెల్లువ



**– విద్యార్థులను అబినందించిన కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**
**– డిఈఓ గోవింద రాజు**

దేవరకద్ర ప్రతినిధి, మే 01(తీన్మార్ న్యూస్): కొత్తకోట పట్టణ కేంద్రంలో ని నివేదిత హైస్కూల్ విద్యార్థులు జి. నందినీ 10/10, జి. వైశాలి 10/10, జి. శ్రీధారాణి 10/10, సువంశిక10/10, ఎస్పీ. జ్ఞానేశ్వర్ 10/10 జిపిఏ లు సాధించారు. ఈ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయులను, యాజమాన్యాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తో పాటు డిఇఓ గోవింద రాజు అబినందించారు.

# "ఆపదలో ఉన్న కుటుంబాలను పరామర్శిస్తూ



**– మనో ధైర్యాన్ని నింపే మాజీ ఎంపిపి రామనాథం."**

అచ్చంపేట ప్రతినిధి, మే 01(తీన్మార్ న్యూస్): అచ్చంపేట మండలం, బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పసుల సురేష్, నానమ్మ పసుల లక్ష్మమ్మ మరణించిన విషయం తెలుసుకొని వారి స్వగృహానికి వెళ్లి పూలమాలవేసి నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ రామనాథం మరియు గ్రామ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పదవ ఫలితాల్లో విజ్ఞాన్ విద్యాసంస్థల ప్రభంజనం




భువనగిరి జిల్లా ప్రతినిధి, మే 01(తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బోర్డ్ ఆఫ్ సెకండరీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రకటించిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో భువనగిరి పట్టణంలో విజ్ఞాన్ విద్యాసంస్థలు విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. 2023 24 విద్య సంవత్సరపు పదవ తరగతి ఫలితాల్లో విజ్ఞాన్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు 100% ఫలితాలు సాధించింది. ప్రథమ స్థానంలో నిలిచారని పాఠశాల చైర్మన్ డాక్టర్ పగిడాల జలంధర్ రెడ్డి తెలిపారు. సాత్విక 9.8, హిమ వర్షిని 9.8, ఎం ప్రసన్న 9.7, ఏదునూరి వైష్ణవి 9.5, మల్లాపురం సిరి 9.5, సురుగురు హరిప్రసాద్ 9.5, కళ్లెం సుశాంత్ 9.3, పేరబోయిన భరత్ 9.3, వంగాల తరుణ్ తేజ 9.3, చిలువేరు నవ్య 9.3, ఏదునూరి వైష్ణవి 9.3, వాకిటి అఖిల్ 9.3, కోరిపల్లి హన్సిక 9.2, నిర్నిమల తరుణ్ 9.2, మార్గోని అస్మిత 9.0, అబ్దుల్ ఖాదిర్ 9.0, అందే దుర్గ శ్రీ 9.0, సాధించడం జరిగిందన్నారు. ఈ మేరకు పది ఫలితాలు అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ఆవరణలో జరిగిన ప్రత్యేక అభినందన సభలో పాఠశాల చైర్మన్ డాక్టర్ పగిడాల జలంధర్ రెడ్డి నగదు ప్రోత్సాహక బహుమతులతో పాటు మెమొంటో అందజేసి అభినందించారు.

# ఉస్మానియాలో హాస్టల్స్ బంద్

హైదరాబాద్: హైదరాబాద్‌లో రోజురోజుకు నీటి కొరత తీవ్రం అవుతోంది. ఇప్పుడు దాని ప్రభావం ఉస్మానియా యూనివర్శిటీపై పడింది. నీటి కొరత కారణంగా ఉస్మానియా యూనివర్శిటీ హాస్టల్స్ మూసివేస్తున్నట్టు వార్డెన్ ప్రకటన జారీ చేశారు. మే ఒకటో తేదీ నుంచి హాస్టల్స్, మెస్ మూసివేస్తున్నట్టు ఓ ప్రకటన వెలువడింది. ఈ ప్రకటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతోంది. ఉస్మానియా యూనివర్శిటీలో నీటి కొరత ఉందని ఆదివారం విద్యార్థినులు ఆందోళన చేపట్టారు. లేడీస్ హాస్టల్‌లో నీళ్లు విద్యుత్ సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనిపై అధికారులను నిలదీస్తు ధర్నాలు చేశారు. అమ్మాయిలకు సవా లక్ష సమస్యలు ఉంటాయని నీళ్లు సరఫరా చేయకుంటే ఎలా అంటూ విద్యార్థినులు నిలదీశారు. అధికారులు, ప్రభుత్వం తీరుకు నిరసనగా ఆందోళన బాటపట్టారు.

# పార్లమెంట్ ఎన్నికలో డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ను గెలిపించుకుందాం

**- బీఆర్ఎస్ పార్టీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు & అచ్చంపేట మాజీ శాసనసభ్యులు డాక్టర్ గువ్వల బాలరాజు**

అచ్చంపేట ప్రతినిధి, మే 01(తీన్మార్ న్యూస్): పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నాగర్ కర్నూల్ ఎంపీగా పోటీచేస్తున్న విద్యావంతుడు, గురుకులాల మాజి కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ను గెలిపించుకుందామని బీఆర్ఎస్ పార్టీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు & అచ్చంపేట మాజీ శాసనసభ్యులు డాక్టర్ గువ్వల బాలరాజు పిలుపునిచ్చారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కి మద్దతుగా బుధవారం అచ్చంపేట పట్టణంలోని 8, 18వ వార్డులలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, శ్రేణులు,





అభిమానులతో కలిసి ప్రచారం నిర్వహించారు. గతంలో గురుకులాల కార్యదర్శిగా ఉన్న సమయంలో విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిన ఘనత వారిదని, ఎంపీగా గెలిపిస్తే నాగర్ కర్నూల్ ప్రాంతానికి మరిన్ని సేవలు చేస్తారని పేర్కొన్నారు. మే 13న జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్ కర్నూల్ బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కి మీ అందరి అమూల్యమైన ఓటును వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరసింహ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు రమేష్ రావు, అంతటి శివ, నాయకులు శంకర్ మాదిగ, బొల్లె నాగరాజు, స్థానిక నాయకులు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

# పది ఫలితాల్లో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఆల్ టైం రికార్డ్

**- పరీక్ష ఏదైనా ప్రభంజనం సృష్టించడం కృష్ణవేణి విద్యాసంస్థల లక్ష్యం**

**- స్కూల్ టాపర్ గా ఎన్.శృతి 9.8/10 గ్రేడ్**

**- విద్యార్థులను ఉపాధ్యాయులును అభినందించిన పాఠశాల యాజమాన్యం**

**- కృష్ణవేణి శ్రీ మేధ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ : పలుస శ్రీనివాస్ గౌడ్**



వనపర్తి ప్రతినిధి మే 01(తీన్మార్ న్యూస్): వనపర్తి పట్టణ కేంద్రంలోని కృష్ణవేణి హైస్కూల్ విద్యార్థులు పదవతరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించరని పలుస శ్రీనివాస్ గౌడ్ తెలియచేశారు. విద్యార్థులు నాడైనా, నేడైనా వనపర్తి పట్టణంలో ప్రభంజనం సృష్టించి ఆల్ టైం రికార్డు సాధించిన ఏకైక విద్యాసంస్థ అని 9.8/10 సాధించి ప్రభంజనం సృష్టించారని ఆయన తెలిపారు.

9.8/10 పైగా ఎన్.శృతి,
9.5/10 ఒక్కరికి.
9.2/10 పైగా ఇద్దరికి.
9.0/10 పైగా 3 ముగ్గరికి,
8.8/10 పైగా 4గురు,
8.7//10పైగా 5గురు,
8.5/10 పైగా 5 గురు కి గ్రేడ్స్ వచ్చాయని ఈ సందర్భంగా జిల్లా స్థాయి లో ప్రతి సంవత్సరం అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్న విద్యా సంస్థగా అందరి మన్ననలను అందుకుంటూ అప్రతిహాతంగా ముందుకు సాగుటకు కారకులైన ఉపాధ్యాయులను, విద్యార్థులను కృష్ణవేణి విద్యా సంస్థల యాజమాన్యం హృదయ పూర్వకంగా అభినందిస్తున్నమని, అలాగే సహకరించిన తల్లిదండ్రులకు శ్రీ మేధ, కృష్ణవేణి విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ పలుస శ్రీనివాస్ గౌడ్. ధన్యవాదములు తెలియచేశారు.

# అస్తవ్యస్తంగా మారిన ఆత్మకూర్ సీహెచ్ సీ హాస్పటల్ పరిస్థితి

**- సూది లేదంటూ రోగులకు చుక్కలు చూపిస్తున్న వైద్యులు**

ఆత్మకూర్, మే 01(తీన్మార్ న్యూస్): సూది ఉంటే మందు లేదు మందు ఉంటే సూది లేదు, సూది మందు ఉంటే సూది గుచేటోళ్లు లేరు అన్న చందంగా మారింది.వనపర్తి ఆత్మకూర్ పీహెచ్సీ హాస్పటల్ పరిస్థితి. ప్రభుత్వాలు మారిన ఇక్కడ వైద్యనిర్వహణలో ఎలాంటి మార్పులు జరుగా లేదు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సౌకర్యాల విషయంలో అటు ప్రభుత్వ అధికారులు ఇటు ప్రజా ప్రతినిధుల పర్యవేక్షణ లేకపోవడంతో పేద ప్రజలకు అనారోగ్యం వస్తే అక్కడ చికిత్సకు వెళ్ళేకన్నా చావే శరణ్యం అనుకుంటున్నారు. కనీసం రెండు రూపాయల సూదిని కూడా బయటనుంచి తెచ్చుకోవాలని వైద్యులు పేషంట్లకు చెప్పడం ఆందోళన కలిగిస్తుంది. కుక్కకాటు బాధితులకు వ్యాక్సిన్ కూడా బయటే కొనుక్కుని వస్తేనే వైద్యం చేస్తామని చెప్పడం ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతోంది. బాధలో ఉన్న పేషంట్ సిరంజిని,మందులు బయట నుంచి కొనుక్కుని వెళ్తేనే వైద్యులు వైద్యం అందిస్తున్నారంటే హాస్పటల్లో పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పనవసరం లేదు. కొన్ని సందర్భాల్లో బీపీ చెకప్ మిషన్ లేక పోవడంతో రోగులు




నా నా అవస్థలు పడుతున్నారు.ప్రభుత్వం లక్షల రూపాయల వెచ్చించి, డాక్టర్లకు, సిబ్బందికి జీతాలు ఇస్తున్నారు. కానీ రోగులకు కావలసిన కనీస వసతులు కల్పించకపోవడం ఆత్మకూర్ ప్రజల దౌర్భాగ్యంగా చెప్పుకోవచ్చు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోతే పేద ప్రజల ప్రాణాలు గాల్లో కలసిపోవలసిందే రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# అభివృద్ధి చేస్తా ఆశీర్వదించండి

**- బహుజన్ సమాజ్ పార్టీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి అయితరాజు అబ్బేందర్**

భువనగిరి, మే 01( తీన్మార్ న్యూస్): బహుజన్ సమాజ్ పార్టీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి అయితరాజు అబ్బేందర్ భువనగిరిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, భువనగిరి పార్లమెంట్ పరిధిలో ఉన్న కార్మికులకు ప్రపంచ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తనను పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపిస్తే భువనగిరి పార్లమెంట్ ను ఈదేశంలోనే అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానని, సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్,చిట్యాల ఐలమ్మ, దొడ్డి కొమరయ్య, బెల్లి లలిత స్ఫూర్తితో రాజకీయల్లోకి వచ్చానని, నిరుద్యోగ సమస్యలు, కాలుష్యం కోరల్లో నియోజకవర్గం కొట్టుమీట్టుడుతుందని, అన్ని రంగాల్లో వెనకబాటుకు గత పాలకులు కారణం అయ్యారని, కేంద్ర ప్రభుత్వంలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి మరోసారి అధికారం ఇస్తే రాజ్యాంగాన్ని మార్చి, మనువాదాన్ని అమలు చేస్తారని ప్రజలు ఆలోచించాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆరు గ్యారంటీల పేరుతో అమలు చేయడంలో విఫలం అయ్యారని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చారాలని డిమాండ్ చేశారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో బహుజన్ సమాజ్ పార్టీ అధికారంలో ఉ



న్నప్పుడు ప్రజలకు అత్యుత్తమ పాలనను అందించారని, తెలంగాణాలో బహుజన్ సమాజ్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కనకుంట్ల పాండు, జిల్లా ఉపాధ్యక్షులు బాసాని మహేందర్, జిల్లా కోశాధికారి కొరబోయిన పాండు, ఆలేరు నియోజకవర్గం ఇంచార్జి గంధమల్ల లింగస్వామి, భువనగిరి నియోజకవర్గ ఉపాధ్యక్షులు బర్రె నగేష్, జిల్లా మహిళా నాయకురాలు బాకారం లావణ్య, సోషల్ మీడియా కన్వీనర్ చుక్క సుమన్, పోచంపల్లి మండల అధ్యక్షులు మీసాల సైదులు, తదితరులు పాల్గొన్నారు.

# పుచ్చలపల్లి సుందరయ్య నేటి తరానికి ఆదర్శం

రామన్నపేట, మే 01(తీన్మార్ న్యూస్): నీతి నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం నేటి తరానికి ఆదర్శమని సిపిఎం మండల నాయకులు వేముల సైదులు అన్నారు. బుదవారం కక్కిరేణి గ్రామంలో అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం సందర్భంగా కార్మికులతో కలిసి మేడే కార్యక్రమం నిర్వహించిన అనంతరం పుచ్చలపల్లి సుందరయ్య 111వ జయంతి కార్యక్రమాన్ని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలే తన బిడ్డలనుకొని ప్రజాసేవ కోసం పిల్లల్ని సైతం కనకుండా కడవరకు నమ్మిన సిద్ధాంతం కొరకు పోరాడిన కమ్యూనిస్టు నాయకుడు అనీ వారసత్వముగా గా వచ్చిన భూమిని సైతం ప్రజలకు పంచి పెట్టిన ప్రజా సేవకుడు ఎలాంటి ఆడంబరాలకు పోకుండా సైకిల్ పై పార్లమెంట్ కీ వెళ్లి ప్రజా సమస్యల పై ప్రశ్నించిన ప్రజా గొంతుకగా నిలిచి నేటి సమాజంలో అడుగడుగునా అవినీతి కమ్ముకున్న సమాజంలో సుందరయ్య నీ లాంటి నేతలు ఎందరయ్య"అని ప్రశ్నించారు వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రామ శాఖ



కార్యదర్శి కన్నెబోయిన యాదయ్య, గ్రామ హామాలి సంఘం అధ్యక్షులు తెడ్ల బోర్రయ్య, వేముల వెంకన్న, కోళ్ల గణేష్, నల్ల ముత్తయ్య, బేక్కంటి రమేష్, సైదులు, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

# హామీని నెరవేర్చిన మంత్రి సీతక్క

**శివాలయానికి ప్రహరీ గోడ నిర్మిస్తాన్న వాగ్దానం ప్రకారం పూర్తి**



పంభాపూర్, మే 01 (తీన్మార్ న్యూన్): పంభాపూర్, దాని పరిసర గ్రామాల భక్తుల ప్రజల ఎన్నో సంవత్సరాల కల నెరవేరింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ సీతక్క గ్రామంలోని శివాలయానికి ప్రహరీ గోడ నిర్మిస్తానని వాగ్దానం చేసింది. మాట ప్రకారం వెంటనే గెలవగానే అధికారంలోకి రాగానే పంబాపూర్ శివాలయానికి 5 లక్షల రూపాయల ప్రహరీ గోడ నిర్మించారు. శివాలయానికి ప్రహరీ గోడ లేకపోవడంతో భక్తులకు గ్రామస్తులకు ఇబ్బందులు ఏర్పడేది. ఇప్పుడు ఆ ప్రహరీ గోడ నిర్మాణంతో ఇబ్బందులు తప్పాయి. ప్రశాంతంగా వచ్చి దైవ జ్ఞానం చేసుకుని ఆధ్యాత్మిక చింతన పొంది వెళ్తున్నారు. కాగా ఇంకా కొంత నిర్మాణం పూర్తయ్యేది ఉంది. దీన్ని త్వరలోనే పూర్తి చేస్తామని మంత్రి సీతక్క హామి ఇచ్చారు.

మంత్రి సిద్ధంగా ఎన్నికల హామీ నిలబెట్టుకుని ప్రహరీ గోడ నిర్మించినందుకు పంబాపూర్ గ్రామస్తులు దాని పరిసర గ్రామాల భక్తులందరూ హర్శం వ్యక్తం చేశారు.

# నిరుపేదల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది

**- కాంగ్రెస్ పార్టీలో చేరిన పెబ్బేరు మండలం బునియాదిపురం బీఆర్ఎస్ నాయకులు**

పెబ్బేరు, మే 01(తీన్మార్ న్యూస్): పెబ్బేరు మండలం, బునాదిపురం గ్రామ బీఆర్ఎస్ పార్టీకి చెందిన 70 మంది నాయకులు కార్యకర్తలు బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్, స్థానిక నాయకుల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వనపర్తి లోని ఎమ్మెల్యే మేఘారెడ్డి నివాసం వద్ద ఏర్పాటు చేసిన చేరికల కార్యక్రమంలో వీరికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని కాంగ్రెస్ పార్టీని గ్రామ గ్రామాన బలోపేతం చేసేందుకు



ప్రతి ఒక్కరు కష్టపడాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పెబ్బేరు మండలం నాయకులు భాను ప్రకాష్ రెడ్డి, తిరుపతయ్య మైమూద్, రాములు యాదవ్, శ్రీరంగపురం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యాన్ని అధిరోహించి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తేవాలి


**- సానియా ను సన్మానించిన కాంగ్రెస్ నేతలు**

వనపర్తి, మే 01(తీన్మార్ న్యూస్): ఎంచుకున్న లక్ష్యాన్ని అధిరోహించి వనపర్తి జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సయ్యద్ అక్తర్, పట్టణ కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షుడు హనీస్ కోరారు. వనపర్తి పట్టణంలోని చిట్యాల రోడ్డులో ఉన్న డబుల్ బెడ్రూం కాలనీకి చెందిన సానియా అనే విద్యార్థిని ఇంటర్ ఒకేషనల్ లో 1000/960 మార్కులు సాధించి వనపర్తి టౌన్ ఫస్ట్ గా నిలిచారు.ఈ సందర్భంగా బుధవారం వారు సానియాను శాలువా, పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కృషి,పట్టుదలతో చదువుకొని అందరికీ ఆదర్శంగా నిలవాలని వారు ఆకాంక్షించారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే దేనినైనా సాధించవచ్చని వారు గుర్తు చేశారు.



# పెండింగ్ కేసులపై దృష్టి సాధించండి

**- జిల్లా ఎస్పీ రక్షితమూర్తి**



వనపర్తి ప్రతినిధి, మే 01(తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఎస్పీ కార్యాలయంలో బుధవారం ఉదయం, జిల్లాకు సంబంధించిన వనపర్తి టౌన్, వనపర్తి రూరల్, రేవల్లి, వీపనగండ్ల పోలీస్ స్టేషన్లకు సంబంధించిన ఎస్ఐలతో పెండింగ్ కేసుల పై సమీక్ష నిర్వహించారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రెండేళ్లకు సంబంధించిన కేసుల గురించి పరిశోధన పూర్తిచేసి చార్ సీటు దాఖలు చేయాలని, పకడ్బందీగా దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. కోర్టు అధికారులతో సమన్వయంతో వ్యవహరిస్తూ కేసులో పురోగతిని పర్యవేక్షించాలన్నారు. చోరీ కేసులలో అన్ని కోణాలలో ప్రణాళిక ప్రకారం దర్యాప్తు చేపట్టాలని అన్నారు. సీసీ కెమెరాలను నిత్యం పర్యవేక్షించాలని, పాత నేరస్తులపై, అనుమానితులపై నిఘా కొనసాగించాలని రాత్రి వేళల్లో లాడ్జీలను చెక్ చేయాలని తెలిపారు.ఇట్టి సమావేశంలో వనపర్తి టౌన్ ఎస్ఐ జయన్న, వనపర్తి రూరల్ ఎస్సై జలంధర్ రెడ్డి, రేవల్లి ఎస్సై తిరుపతి రెడ్డి, వీపనగండ్ల ఎస్సై నందికర్ పాల్గొన్నారని ఎస్పీ పిఆర్వో రాంచందర్ రావ్ తెలియచేశారు.

# తీన్మార్ న్యూస్ ఎఫెక్ట్

## హమాలీల సమస్యపై పోరాటం చేసిన ఐక్యవేదిక

- మే డే రోజున స్పందించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి
- ధన్యవాదాలు తెలిపిన అఖిలపక్ష ఐక్యవేదిక.


ప్రపంచ కార్మికులారా ఏకంకండి

- కార్మికులకు పిలుపునిచ్చిన సమయాన, గంజి, బజారు హమాలీలు
- ఐక్యవేదిక మరియు అఖిలపక్షానికి అభ్యర్థన
- అభ్యర్థన మేరకు వెళ్లిన అఖిలపక్షం
- నిలువ నీడలేని హమాలీలకు రక్షణ కల్పించండి
- జిల్లా కలెక్టర్ మరియు ఎమ్మెల్యేకు అఖిలపక్ష ఐక్యవేదిక విజ్ఞప్తి

తీన్మార్ www.teenmaarepaper.com 30 Apr 2024 - Page 4






వనపర్తి ప్రతినిధి, మే 01(తీన్మార్ న్యూస్): గత వారంలో రోజులుగా గంజి దగ్గర ఉండే బజారు హమాలీలు తమ సమస్యలపై అఖిలపక్ష ఐక్యవేదికను సంప్రదించగా, రెండు రోజుల క్రితం వారి వద్దకు వెళ్లి వారి సమస్యలను తీన్మార్ పత్రిక ముఖంగా ఎమ్మెల్యేకు జిల్లా కలెక్టర్ కి విన్నవించగా బుధవారం మేడే సందర్భంగా హమాలీలతో సమావేశమైన అఖిలపక్ష ఐక్యవేదిక సభ్యుల దగ్గరకు ప్రచారంలో ఉన్న ఎమ్మెల్యే హాజరై వారి సమస్యలను సావధానంగా విన్న ఎమ్మెల్యే ఎలక్షన్ కోడ్ ఉన్నందున ఆ సమస్యలపై వచ్చే నెల నాలుగు తర్వాత స్పందిస్తానని హామీ ఇచ్చారు. హమాలీ సంఘం నాయకులు, అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్, సిపిఐ జిల్లా నాయకులు గోపాలకృష్ణ, టిడిపి రాష్ట్ర నాయకులు కొత్త గొల్ల శంకర్, నాయకులు శివకుమార్, బొడ్డుపల్లి సతీష్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్ కౌన్సిలర్లు బ్రహ్మచారి, వెంకటేష్ తదితరులు మళ్లీ ఒకసారి ఎమ్మెల్యే దృష్టికి ఈ సమస్యలపై తీసుకువస్తామని తెలిపారు.

# కారు ఖరా?నాకు, సారు దవాఖానాకు

- తెలంగాణను దోచిన దుష్ట చతుష్టయాలు జైలుకెళ్లడం కాయం
- పంచ పాండవులం ఆలేరు అభివృద్ధికి 100 కోట్లు తెస్తాం
- రికార్డు స్థాయి మెజార్టీ తో ఎమ్మెల్యేగా బీర్ల గెలుపులో రాజపేట మండల పాత్ర కీలకం
- ఎన్నికల ప్రచారంలో రాజపేటలో భువనగిరి కాంగ్రెస్ ఇంచార్జి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

రాజాపేట, మే 01(తీన్మార్ న్యూస్): బిఆర్ఎస్ పార్టీ పరిస్థితి దయనీయంగా మారిందని, కారు కారా?నాకు సారు దవాఖా నాకు వెళ్ళాడని, పార్లమెంట్ ఎన్నికల తర్వాత దుష్ట చతుష్టయాలు జైలుకెళ్లడం ఖాయమని భువనగిరి పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి రాజపేట మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్ షో నిర్వహించి మాత్మ గాంధీ విగ్రహం కూడలి వద్ద ప్రజల నిర్దేశించి మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటేసి చామల కిరణ్ కుమార్ రెడ్డిని గెలిపిస్తే పంచ పాండవుల మాదిరిగా కోమటిరెడ్డి వెంకట్రెడ్డి, తాను, బీర్ల ఐలయ్య అందం సంజీవరెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి లు ఆలేరుకు 100 కోట్ల రూపాయలు నిధులు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. గంధముల రిజర్వాయర్ ఒకటి ఎం సి మంజూరి అయిందని సర్వే కూడా పూర్తయిందని తెలిపారు. దీంతో ఎనిమిది మండలాలకు సాగు తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం కానుంది అన్నారు. చేనేత కార్మికుల సమస్యలన్నీ పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

బీసీ నాయకుడు అయిన బీర్ల ఐలయ్య ప్రజల వత్సల పరిష్కారానికి కృషిచేసి ఆలేరు ఎమ్మెల్యేగా రికార్డ్ స్థాయిలో మెజార్టీ సాధించి గెలుపొందాడని ఆయన స్వయంకృషి వల్లే మంచి నాయకుడిగా నిలిచాడని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కితాభిచారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ అందం సంజీవరెడ్డి జిల్లా బాధ్యతలతో అన్ని విజయాలే వరిస్తూ వచ్చాయని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కమల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపు తధ్యమని ధీమా వ్యక్తం చేశారు. తన నమ్మకానికి తోడుగా కేంద్ర నిధులు ఆలేరుకు అధికంగా వచ్చేందుకు ఎంపీగా చేతి గుర్తుకు ఓటేసి చామల కిరణ్ కుమార్ రెడ్డిని గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలో రాజపేట మండలంకు ఎంతో చరిత్ర ఉందని బిర్లా అన్నారు. మేడే సందర్భంగా కార్మిక లోకానికి శుభాకాంక్షలు తెలిపారు. రేవంత్ రెడ్డి పాలనలో కార్మికులకు అన్ని శుభాలే కలుగుతాయని చెప్పారు. రాజన్న వెంకన్న దయతో నియోజకవర్గానికి ఇప్పటి వరకు 120 కోట్ల రూపాయలు నిధులు మంజూరి చేసి అభివృద్ధి పనులు చేపట్టినట్లు బిర్ల వివరించారు.



నమ్మకానికి మారుపేరుగా రాజపేట మండలం పేరుగాంచిందని ప్రజలు ఎంతో ప్రేమ కురిపిస్తారని ఆయన చెప్పారు. ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఒక అవకాశం ఇస్తే ప్రజల రుణం తీర్చుకుంటానని అన్నారు. రాజపేట మండల యువజన విభాగమ అధ్యక్షులు ఇంజ నరేష్ మాట్లాడుతూ దళితుల క్షేమం కోరేది కేవలం కాంగ్రెస్ పార్టీ అని, దళితులు కాంగ్రెస్ వెంటే ఉంటారని అన్నారు. కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగే పెంటయ్య గౌడ్ మాట్లాడుతూ రాజపేట మండలం అత్యధిక మెజారిటీతో ఎంపీ అభ్యర్థిని గెలుపులో భాగస్వామ్యం అవుతుందని హామీ ఇచ్చారు. జిల్లా అధ్యక్షులు అందె0 సంజీవరెడ్డి, మహిళా అధ్యక్షురాలు నీలం పద్మ, జనగామ ఉపేందర్ రెడ్డి గుడిపాటి మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొని మాట్లాడారు. రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనడం పట్ల మహేందర్ గౌడ్ కృతజ్ఞతలు చెప్పారు. తహసిల్దార్ కార్యాలయం సమీపము నుండి ప్రధాన వీధుల గుండా మాత్మ గాంధీ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. జెండాలు పట్టుకొని నృత్యాలు చేస్తూ కాంగ్రెస్ అభిమానులు ఘన స్వాగతం పలికారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికి నుదుట తిలకం దిగారు. జై కాంగ్రెస్ చేతి గుర్తుకే మన ఓటు అంటూ నినాదాలు చేశారు. మసిరెడ్డి సురేందర్ రెడ్డి, మేడిశెట్టి సురేష్, పట్టణ అధ్యక్షులు ఐదేని నరేష్, బొంతూ సుధాకర్, బొడ్డుల నగేష్, జిల్లా బిక్షపతి గౌడ్, పండరి, బూత్కూరి నరసింహారెడ్డి, పాండవుల రమేష్ గౌడ్, రాంజీ నాయక్, కాలే సుమలత, నమిల కేదారి, తదితరులున్నారు.

# కాంగ్రెస్ యువగర్జన సభను విజయవంతం చేయండి

- టేక్మాల్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సంగమేశ్వర్ గౌడ్



టేక్మాల్, మే 01(తీన్మార్ న్యూస్): జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి సురేష్ షెట్కార్ ని భారీ మెజార్టీతో గెలిపించాలని టేక్మాల్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సంగమేశ్వర్ గౌడ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రివర్యులు దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు టేక్మాల్ మండల కేంద్రంలోని స్థానిక చౌరస్తా వద్ద యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల యువజన కాంగ్రెస్ అద్యక్షులు సంగమేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీ.సురేష్ షెట్కార్ ని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపిచ్చారు. రేపు ఆందోల్ నియోజకవర్గం వట్పల్లి మండల కేంద్రంలోని స్థానిక ఎస్అర్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో జరగబోయే "యువ గర్జన సభ"ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సిద్దు, మండల ఉపాధ్యక్షుడు ఖాజా, వివిధ గ్రామాల యువజన కాంగ్రెస్ అద్యక్షులు, కార్యదర్శులు సంగమేశ్వర్, హరి ప్రసాద్, మహేష్ రెడ్డి, శ్రీకాంత్, కుమార్ యాదవ్, నాయికోటి బాబు, శ్రీకాంత్, నవీన్, సాయి, శేషు గౌడ్, రియాజ్, మహేష్, శ్రావణ్, భూషణ్, ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

# అవకాశం ఇవ్వండి అభివృద్ధి కోసం గళం విప్పుతా....

- రామన్నపేటలో బిఆర్ఎస్ పార్టీ భారీ రోడ్ షో...
- కేసులు, కొట్లాడటం కొత్తకాదు: మాజీ మంత్రి జగదీష్ రెడ్డి
- మాయ మాటలు నమ్మి ప్రజలు మోసపోయారు: మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి
- నాలుగు నెలల్లోనే కరువు కాటకాలు వచ్చాయి: బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామా మల్లేష్
- రోడ్ షో లో హాజరైన జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, చెరుకు సుధాకర్

రామన్నపేట, మే 01(తీన్మార్ న్యూస్): అసెంబ్లీ ఎన్నికలు జరిగిన ఐదు మాసాలలోనే మరల ఎన్నికలు వచ్చాయి ఈ పరీక్ష నెగ్గాల్సి ఉన్నదని పార్టీ శ్రేణులకి నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పిలుపునిచ్చారు. బుదవారం నాడు సాయంత్రం రామన్నపేట మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్ షో లో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ఎవరికన్నా అమలు అయ్యాయా అని ప్రశ్నించారు. ప్రజలను మోసం చేసి గెలిచారన్నారు. ప్రజలు వాళ్ళు ఇచ్చిన హామీల మాటలు నమ్మి మోసపోయారని అన్నారు. రామన్నపేట పట్టణంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు, కోట్ల నిధులతో రోడ్డు పనులు చేశానని అన్నారు. అనంతరం భువనగిరి బిఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి క్యామా మల్లేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలల్లోనే కరువు సంభవించిందని, అవకాశం ఇవ్వండి అభివృద్ధి కోసం,



నిధుల కోసం, కావాల్సిన రిజర్వేషన్ల కోసం గళం విప్పి కొట్లదుతానని, దేవుళ్ళు వేరు రాజకీయాలు వేరు అని, దేవుళ్ళ పేరు చెప్పి ఓట్లు అడిగే దుస్థితి ఉన్నదని అన్నారు. కోన నాలుకకి మందు పెడితే ఉన్న నాలుక ఉడినట్టు ఉన్నదని ప్రభుత్వ పాలన అని అన్నారు. దేశానికి కావల్సింది రాజ్యంగాలు మార్పు కాదు తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్ట లేని జీవితాలు ఇంకా ఎందరో గడుపుతున్నారని, వారికి మార్పు చేయాలని అన్నారు. అనంతరం మాజీ మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ రామన్నపేట ప్రజానీకం ను చూస్తుంటే నకిరేకల్



నియోజకవర్గం లోని రామన్నపేట మండలం నుండి అత్యదిక మెజార్టీ వస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక లక్షల ఎకరాలు నీళ్లు లేక ఎండిపోయాయి అని అన్నారు. కేసులు, కొట్లడటం, కొత్తకాదు ఎన్నో ఉద్యమాలు చేసి తెలంగాణను సాధించిన పార్టీ అని అన్నారు. ప్రజలను ఎవరు వదిలేసిన కెసిఆర్ మాత్రం వదిలెయ్యరు అని అన్నారు. ప్రజలు కూడా కెసిఆర్ వెంటే ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, తెలంగాణ ఉద్యమకారులు చెరుకు సుధాకర్ గౌడ్, మాజీ ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి బలరాం, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పోషబోయిన మల్లేషం, రైతు సమన్వయ సమితి మాజీ మండల అధ్యక్షులు బొక్క మాధవ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాస్, నాయకులు సాల్వేరు అశోక్, ఎడ్ల మహేందర్ రెడ్డి, బందెల రాములు, ముక్కాముల దుర్గయ్య, ఎంపీటీసీ వేమావరపు సుదీర్ బాబు, అవుల నరేందర్, చిన్నపాక రమేష్, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.



# చిన్నపిల్లల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవు

నర్సాపూర్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలందరూ చట్టాల పైన అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా చిన్నపిల్లల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని న్యాయమూర్తి అనిత హెచ్చరించారు. శనివారం మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో నర్సాపూర్ కోర్టులో విజ్ఞాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జడ్జి అనిత మాట్లాడుతూ స్థిరాస్తులను కొనుగోలు, అమ్మకాలు జరిపినప్పుడు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. తెల్ల కాగితాలపై స్థిరాస్తులు కొనుగోలు అమ్మకాలు జరప వద్దని రిజిస్ట్రేషన్ తప్పనిసరన్నారు.

భార్యాభర్తల మధ్య విభేదాలు పెంచుకొని దాంపత్య జీవితాలు నాశనం చేసుకోవద్దు అన్నారు, ఇటీవల తరచూ భార్యాభర్తల మధ్య గొడవతో తగు న్యాయం నిమిత్తం మండల్ లీగల్ సర్వీస్ కమిటీని ఆశ్రయిస్తున్నారు. కుటుంబపరమైన సమస్యలు ఏదైనా తలెత్తినప్పుడు సామరస్యంగా సమస్యలను పరిష్కరించుకునే దిశగా ప్రయత్నాలు చేసి కలిసిమెలిసి ఉండాలి ఆమె గుర్తు చేశారు. అనంతరం లీగల్ సర్వీస్ బెంచ్ ద్వారా పలు పిఎల్సి కేసులను పరిశీలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు స్వరూప రాణి, ఆర్. శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ న్యాయవాది పుష్ప రాజ్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ సిబ్బంది, కోర్టు సిబ్బంది, కోర్ట్ పోలీస్ కానిస్టేబుల్స్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బెరియాట్రిక్ సర్జరీతో మధుమేహం దూరం

- కేర్ బంజారాహిల్స్ సీఓఓ సయ్యద్ క్రమాన్ హుస్సేన్

హైదరాబాద్: హై బీఎమ్ఐ ఉన్న డయాబెటిక్ రోగుల్లో బేరియాట్రిక్ సర్జరీతో మధుమేహం దూరమవుతున్నట్టు కేర్ ఆస్పత్రి (బంజారాహిల్స్) సీఓఓ సయ్యద్ క్రమాన్ హుస్సేన్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆస్పత్రిలో ఇటీవల ఒడిషా రాష్ట్రానికి చెందిన ముగ్గురు హైబీఎమ్ఐ ఉన్న రోగులు ట్రాన్స్ ఫర్మేటివ్ సర్జరీ తర్వాత డయాబెటీస్ నుంచి పూర్తిగా బయటపడ్డారని చెప్పారు. ఈ సర్జరీ తర్వాత సదరు రోగులు డయాబెటిస్ మందులు వాడాల్సిన అవసరం లేకుండా పోయిందని వెల్లడించారు. మెటబాలిక్ సర్జరీగా కూడా వ్యవహరించే ఈ శస్త్రచికిత్సను లాపరోస్కోపికల్‌గా చేస్తారని ఆయన తెలిపారు.

ఈ సర్జరీలో భాగంగా హార్మోన్ ఉత్పత్తిని ప్రేరేపించడానికి వీలుగా కడుపు, పేగులను తిరిగి మారుస్తారని ఆస్పత్రి కన్సల్టెంట్ సీనియర్ రోబోటిక్ బేరియాట్రిక్ సర్జన్ డాక్టర్ వేణుగోపాల్ పరీక్ తెలిపారు.




హైబీపీ, ఊబకాయం తదితర వాటి కారణగా వెన్నునొప్పి, కీళ్ల నొప్పులు, మోకాళ్ల నొప్పులు, శ్వాస ఆడకపోవడం, రక్తపోటు,, నిద్రలేమి, భారీ గురక సమస్యలకు ఆ రోగులు మందులు వాడేవారని తెలిపారు. వారి శరీరంలో చక్కెర స్థాయిలు నియంత్రణలోకి రాకపోవడంతో సర్జరీ చేయించుకున్నారని చెప్పారు. ఈ సర్జరీతో జీవితకాలం పెరగడంతో పాటు ఆ కాలంలో మెరుగైన జీవితం లభిస్తుందని పేర్కొన్నారు.

# ఇక ఇంటర్ లోనూ... ఆన్ లైన్ అడ్మిషన్లు..?

హైదరాబాద్: డిగ్రీ తరహాలో ఇం టర్‌లోనూ ఆన్‌లైన్ ప్రవేశాలు చేపట్టేలా ఇంటర్ బో ర్డు కసరత్తు చేస్తోంది. దోస్త్ ద్వారా డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లుగానే జూనియర్ కళాశాలల్లో కూడా ఆన్‌లైన్ విధానంలో ప్రవేశాలు చేపడతామని అధికారులు కొన్నేళ్లుగా చెబుతున్నా, వివిధ కారణాలతో వాయిదా పడుతూనే వస్తోంది. ప్ర స్తు తం రాష్ట్ర ఇంటర్ బోర్డ్ సర్వీసులు ఎక్కువగా ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు అందించే సే వలతో పాటు ప్రైవేట్ కళాశాలలకు అనుబంధ గు ర్తింపు ప్రక్రియ కూడా ఆన్‌లైన్ విధానంలోనే చేపడుతున్నారు. కానీ ప్రధానమైన ప్రవేశాలు సైతం ఆన్‌లైన్‌లో చేపట్టే అంశాన్ని పరిశీలిస్తున్నామని ఇటీవల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. డిగ్రీ తరహాలో ఇంటర్‌లో కూడా ఆన్‌లైన్ ప్ర వేశాలు చేపడితే కళాశాలలఫీజులు వెబ్‌సైట్‌లో పొం దుపరచాల్సి ఉ ంటుంది. దాంతో ఆయా కళాశాలల ఆదాయ, వ్యయాలకు అనుగుణంగా ఫీజులు నిర్ణయించే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో న్యా యపరమైన అంశాలను, ఇతర అంశాలను పూర్తిగా పరిశీలించి జూనియర్ కాలేజీల్లోనూ ఆన్‌లైన్ ప్రవేశాలు చేపట్టే విధంగా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది.జూనియర్ కళాశాలల్లో విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్న పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. ఇంటర్ కోర్సుల ఫీజుల నియంత్రణకు ఇప్పటివరకు ఎలాంటి విధానం లేకపోవడంతో యాజమాన్యాలే ఫీజులు ఖారారు చేసుకుంటున్నాయి. అధిక ఫీజులు వసూలు చేసే కళాశాలలపై ప్రభుత్వం చర్యలు తీసుకున్న దాఖలాలు మాత్రం ఇప్పటివరకు లేవు. దేశంలోనే చాలా రాష్ట్రాల కంటే తెలంగాణ, ఎపి రాష్ట్రాలలోని కార్పోరేట్ జూనియర్ కళాశాలల్లో ఫీజులు అత్యధికంగా ఉన్నాయని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ఆదాయ, వ్యయాలకు అనుగుణంగా ఫీజులు ఉండాలి. కానీ ప్రైవేట్ కళాశాలల ఫీజుల్లో ఆదాయానికి, వ్యయానికి ఏమాత్రం పొంతన ఉండటం లేదు. ఆదాయంలో సగం కూడా వ్యయం ఉ ండటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఐఐటి, జెఇఇ, నీట్, ఎంసెట్ కోచింగ్ వంటి వివిధ రకాల పేర్లతో ఒక్కో విద్యార్థి నుంచి సుమారు రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు కూడా ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రైవేట్ కళాశాలలకు అనుబంధ గుర్తింపు ప్రక్రియ ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఫీజుల వసూలు ప్రక్రియ కూడా ఆన్‌లైన్ ద్వారా చేపట్టే అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. దాంతో ఆయా కళాశాలల ఆదాయ, వ్యయాలకు అనుగుణంగా ఫీజులు నిర్ణయించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

# పెద్దపల్లిలో 'బిగ్ ఫైట్' లో బాస్ ఎవరో ?

## పెద్దపెల్లి గడ్డపై 'పెద్దన్న'గా నిలిచేదేవరో .. సింగరేణి అండ.. ఎవరికో పూదండ

### బొగ్గు గని కార్మికులే గెలుపు ఓటముల నిర్ణేతలు

### పెద్దపెల్లి పార్లమెంటు నియోజకవర్గ ముఖచిత్రం

కమాన్ పూర్ పెద్దపల్లి జిల్లా: పోరాటాల గడ్డ పెద్దపల్లి ఎంపీగా గెలిచి పార్లమెంటు లో అడుగుపెట్టేది ఎవరో త్రిముక పోటీలో పెద్దపల్లి నాయకుడు ఎవరు కారున్నారో చూడాల్సిందే.

విప్లవ వీరులను అందించిన పెద్దపల్లి లోకసభ స్థానానికి దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది వామపక్ష ఉద్యమానికి ఊపిరిలోదిన సోదరులు కిషన్ జి వర మల్లోజుల కోటేశ్వరరావు మల్లోజుల వేణుగోపాలరావు పెద్దపెల్లి బిడ్డలే వీరే కాకుండా అనేకమంది అగ్ర నేతలుగా ఎదిగారు. సింగరేణి బొగ్గు గనులు, పచ్చని పొలాలు, తెలంగాణ సాగు దశను మార్చే కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టు, ఎన్టీపీసీ, సిమెంట్ పరిశ్రమలు, యూరియా కర్మాగారం.. ధర్మపురి, కాళేశ్వరం వంటి ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు నెలవు పెద్దపల్లి లోక్సభ నియోజకవర్గం. నైసర్గికంగానే కాకుండా రాజకీయంగానూ విభిన్నత, వైవిధ్యం దీని సొంతం. తెలంగాణ ఉద్యమానికి కేంద్ర బిందువైన ఈ నియోజకవర్గం ఇచ్చే తీర్పుపై ఆసక్తి నెలకొంది. పెద్దపల్లి లోకసభ నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఈ నియోజకవర్గం కాక ఫ్యామిలీకి కంచుకోట కాగా, గత రెండు పర్యాయాలు కారు జోరు చూపించింది. ఈసారి కారు జోరుకు బ్రేకులు వేసేందుకు హస్తం పార్టీ కాక మనుమడు, ప్రస్తుత చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ తనయుడు గడ్డం వంశీకృష్ణను పెద్దపెల్లి లోక్సభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దింపింది. బీఆర్ఎస్ కూడా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ను బరిలోకి దింపగా, బిజెపి పార్టీ కూడా గోమాస శ్రీనివాస్ ను రంగంలోకి దించింది. దీంతో ఈ నియోజకవర్గంలో పోరు ఆసక్తికరంగా మారింది. ఈసారి ఎలాగైనా పూర్వ వైభవాన్ని సాధించాలని హస్తం పార్టీ కసితో పనిచేస్తుండగా.. అధికార పార్టీకి దీటుగా బీఆర్ఎస్ మరోవైపు బిజెపి వ్యూహ ప్రతి వ్యూహాలతో ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో పెద్దపల్లి లోకసభ నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది. సింగరేణి కార్మికుల ప్రభావం అధికంగా ఉండే ఈ సెగ్మెంట్లో గత పదేళ్లుగా బీఆర్ఎస్ పార్టీదే హవా కొనసాగుతోంది.గత పదేళ్ల క్రితం వరకు కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న ఈ పెద్దపల్లి నియోజకవర్గాన్ని భారీ విక్టరీతో తన ఖాతాలో వేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తుంది. మరోవైపు బిజెపి కూడా ప్రధాని మోదీ చెరిస్మాతో గెలుపు కోసం వ్యూహాలు రచిస్తోంది. మొత్తానికి మూడు పార్టీలు కూడా తగ్గేదిలే అన్నట్లుగా ఎత్తుకు పైఎత్తులతో రాజకీయాన్ని రక్తి కట్టిస్తున్నాయి. పెద్దపెల్లి, మంచిర్యాల, జగిత్యాల నియోజకవర్గం పరిధిలో విస్తరించిన ఈ లోకసభ నియోజకవర్గం పరిధిలో పెద్దపెల్లి, మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి, ధర్మపురి, రామగుండం, మంథని శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి. పెద్దపల్లి లోక్సభ నియోజకవర్గ పరిధిలో 15 లక్షల 94 వేల 392 ఓట్లు ఉన్నాయి. ఇటీవల జరిగిన 2023 శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఈ ఏడు శాసనసభ స్థానాలను క్లీన్ స్వీప్ చేసింది. మొత్తం ఈ ఏడు నియోజకవర్గాల పరిధిలో 6 లక్షల 82 వేల 33 ఓట్లు సాధించి తిరుగులేని ఆదిపత్యాన్ని చెలాయించింది కాంగ్రెస్ పార్టీ. కాగా ప్రధాన ప్రతిపక్షం బి ఆర్ ఎస్ పార్టీకి 3 లక్షల 36 వేల 374 వేల ఓట్లు వచ్చాయి. గతంలో బీఆర్ఎస్ పార్టీ హవా కొనసాగిన పెద్దపల్లి లో గత శాసనసభ ఎన్నికల్లో పూర్తి రివర్స్ ఫలితాలు వచ్చాయి. ఈసారి ఎలాగైనా గెలవాలని కలలుగంటున్న బిజెపికి గత శాసనసభ ఎన్నికల్లో ఏడు శాసనసభ నియోజకవర్గాల పరిధిలో 79 వేల 418 ఓట్లు మాత్రమే వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఏకపక్ష విజయాలను సాధించగా, పార్లమెంట్ ఎన్నికల నాటికి పరిస్థితిలో మార్పు వచ్చిందనే ఆశతో ప్రతిపక్ష పార్టీలు పోటీకి రెడీ అవుతున్నాయి. సిట్టింగ్ బీఆర్ఎస్ ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత కాంగ్రెస్ పార్టీలో చేరగా, సీనియర్ నేత మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కు బీఆర్ఎస్ టికెట్ ఇచ్చి రంగంలోకి దించింది. ఇక ఎప్పటినుండో ఎంపీ కావాలని కలలు కంటున్న గోమాస శ్రీనివాస్ ను బరిలోకి దింపింది బిజెపి. ఇక ఈ రెండు పార్టీలకు దీటుగా ఆర్థిక బలం.. రాజకీయ నేపథ్యం ఉన్న కాక మనవడు, చెన్నూరు శాసనసభ ఎమ్మెల్యే వివేక్ తనయుడు గడ్డం వంశీకృష్ణను ఈ స్థానం నుండి కాంగ్రెస్ పార్టీ బరిలోకి దించింది. పెద్దపెల్లి నియోజకవర్గ పరిధిలో సింగరేణి, ఆర్ ఎఫ్ సి ఎల్, ఎన్ టి పి సి, సిమెంటు పరిశ్రమలు ఉన్నాయి. ఈ నియోజకవర్గంలో సింగరేణి కార్మికులు వారి కుటుంబ సభ్యులే గెలుపు ఓటమి లను ప్రభావితం చేస్తారు. ప్రస్తుతం ఈ లోక్ సభ నియోజకవర్గ పరిధిలో ఏడు శాసనసభ సెగ్మెంట్లలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ఉండటంతో ఆ పార్టీలో గెలుపు ధీమా ఎక్కువగా కనిపిస్తుంది. దీంతో కాంగ్రెస్ పార్టీ దూకుడుకు కళ్లెం వేయాలని బీఆర్ఎస్ పార్టీ పక్క స్కెచ్ వేస్తోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ గెలవాలనే టార్గెట్ తో సీనియర్ నాయకులు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కు టికెట్ ఇచ్చింది బీఆర్ఎస్ పార్టీ. ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన కొప్పుల ఈశ్వర్ అనూహ్యంగా గత ఎన్నికల్లో ధర్మపురి శాసనసభ నియోజకవర్గ స్థానం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతిలో ఓడిపోయారు. సింగరేణి కార్మికుడైన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కు పెద్దపల్లి లోక్సభ నియోజకవర్గ పరిధిలో బందు వర్గం, మిత్రులు, అనుచర వర్గం భారీగా ఉంది. గతంలో ఆయన ప్రాతినిధ్యం వహించిన మేడారం నియోజకవర్గ పరిధిలో భాగమైన రామగుండం, ధర్మపురి నియోజకవర్గంలో అభిమానులు ఉన్నారు. దీంతో కోల్ బెల్టు వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీకి ఓటు బ్యాంకు బలంగా ఉండటంతో గెలుపు పై ఆశలు పెట్టుకుంటుంది. తనకున్న విస్తృత పరిచయాలు తనను గెలిపిస్తాయని నమ్మకంతో బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ధీమాగా ఉన్నారు. ఈ ఏడు నియోజకవర్గాల పరిధిలో కాంగ్రెస్ పార్టీ బలంతో హస్తం జెండా ఎగరేస్తామని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ బలంగా నమ్ముతున్నారు. బలమైన ఆర్థిక నేపథ్యం.. ఘనమైన రాజకీయ వారసత్వం ఉన్న గడ్డం వంశీకృష్ణకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఖరారు చేసి అసెంబ్లీ ఎన్నికల ఊపును కొనసాగిస్తామని కాంగ్రెస్ అంటుంది. చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ తనయుడైన వంశీకృష్ణ తన తాత దివంగత నేత గడ్డం వెంకటస్వామి రాజకీయ వారసత్వానికి తోడుగా.. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ఈ ప్రాంతంలో అభివృద్ధి జరిగిందని ప్రచారం చేసుకుంటున్నారు. తన తాత, తండ్రి ఇద్దరూ ఈ నియోజకవర్గ ఎంపీలుగా ఉండటం తోనే అప్పట్లో వాళ్ళు తెచ్చిన పథకాలు, నిధుల తోనే స్పష్టమైన ముద్ర వేశారని గడ్డం వంశి చెబుతున్నారు. ఈ పెద్దపెల్లి లోకసభ నియోజకవర్గ పరిధిలో ఏడు శాసనసభ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలే ఉండటం తో పాటు, ఇటీవల జరిగిన సింగరేణి ఎన్నికలలో కాంగ్రెస్ అనుబంద యూనియన్ గుర్తింపు సంఘంగా గెలవడం కాంగ్రెస్ కు అడ్వాంటేజ్ గా చెబుతున్నారు. ఇదే సమయంలో బిజెపి అభ్యర్థి గోమాస శ్రీనివాస్ చీల్చే ఓట్లు కూడా ఈ నియోజకవర్గంలో కీలకంగా మారాయి. 1993 నుండి కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన గోమాత శ్రీనివాస్ 2009లో కాంగ్రెస్ టికెట్ ఆశించి బంగపడ్డారు. అప్పట్లో టిఆర్ఎస్ పార్టీలో చేరి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో 2 లక్షల64 వేల 731 ఓట్లు సాధించారు. ఈ ఎన్నికల్లో ఓటమి తర్వాత బిఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన గోమాస మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నూరు శాసనసభ నియోజకవర్గ స్థానాన్ని ఆశించారు. టికెట్టు దక్కకపోవడంతో సంతృప్తితో కాంగ్రెస్ పార్టీని వీడి బిజెపి పార్టీలో చేరారు. పార్లమెంట్ పరిధిలో 15 లక్షల 94, వేల 392 ఓట్లు ఉండగా, అందులో గోమాత శ్రీనివాస్ సామాజిక వర్గమైన మహావీర్ నేతకాని ఓట్లు 2 లక్షల 25 వేల 875 ఓట్లు ఉన్నాయి. ఈ ఓటు బ్యాంకు తనకు కలిసి వస్తుందని గోమాస ధీమా వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి ప్రధాన పార్టీల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ సామాజిక వర్గ ఓట్లతో పాటుగా, ఇతర వర్గాలకు చెందిన ఓట్లను తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నంలో పడ్డారు. ప్రస్తుతం పోటీ పడుతున్న అభ్యర్థులు నేతకాని మాల సామాజిక వర్గానికి చెందినవారు కావడంతో ఇందులో మాదిగ సామాజిక వర్గం ఎవరు వైపు మొగ్గ చూపుతోందనేది ఆసక్తికరంగా మారింది. పెద్దపల్లి లోక్సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో.. రామగుండం, బెల్లంపల్లి, చెన్నూరు, మంథని నియోజకవర్గాల్లో అత్యధికంగా సింగరేణి కార్మిక కుటుంబాలున్నాయి. అభ్యర్థుల గెలుపోటములను వీరి ఓట్లే నిర్దేశిస్తాయి. సింగరేణి కార్మిక కుటుంబాలు ఏళ్లుగా ఎదురు చూస్తున్న అంశం వారసత్వ ఉద్యోగాలు. గత అసెంబ్లీ 2018 ఎన్నికల్లోనూ దీనిపై ప్రచారం చేసి టిఆర్ఎస్ ఓటర్లను ఆకర్షించింది. కానీ వారసత్వ ఉద్యోగాలపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో సమస్య పెండింగ్లో ఉంది. దీంతో ఈ ఎన్నికల్లో ఇదే అంశాన్ని కాంగ్రెస్ ప్రచారాస్త్రంగా ఎంచుకుంది. గతంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు అవకాశం ఇచ్చిన ఓటర్లు ఈసారి ఎలాంటి తీర్పునిస్తారో చూడాలి.

పారిశ్రామిక ప్రాంతంగా పేరుగాంచిన పెద్దపల్లి లోక్సభ నియోజకవర్గ పరిధిలో ఏడు శాసనసభ స్థానాలు ఉన్నాయి. వీటిలో ధర్మపురి, చెన్నూరు, మందమర్రి శాసనసభ స్థానాలు ఎస్సీ రిజర్వుడు కాగా, రామగుండం, మంథని, పెద్దపల్లి, మంచిర్యాల అసెంబ్లీ సెగ్మెంట్ లతో పెద్దపెల్లి లోక్సభ నియోజకవర్గంలో ప్రస్తుతం 17వ సారి పార్లమెంటరీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఏడు నియోజకవర్గాల పరిధిలో మొత్తం ఓట్లు 15 లక్షల 94 వేల 392 ఓట్లు ఉన్నాయి. వీరిలో పురుషులు 7 లక్షల 87 వేల 140 ఓట్లు కాగా, మహిళల ఓట్లు 8 లక్షల 5 వేల 755 ఉన్నాయి. పురుషుల కన్నా 18 వేల 615 మహిళల ఓట్లే ఎక్కువగా ఉన్నాయి. గత 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపెల్లి లోక్సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు శాసనసభ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అన్నింటిని గెలుచుకొని క్లీన్ స్వీప్ చేసింది. 2019 పార్లమెంటరీ ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ నుండి బోర్లకుంట వెంకటేష్ నేత 4 లక్షల 41వేల 321 ఓట్లు సాధించి గెలుపొందగా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆగం చంద్రశేఖర్ 3లక్షల 46వేల 141 ఓట్లతో రెండవ స్థానంలో నిలిచారు. బిజెపి అభ్యర్థి ఎస్. కుమార్ 92,066 ఓట్లు సాధించి తృతీయ స్థానాన్ని సరిపెట్టుకున్నారు.

# రోడ్డు వేయలేదని లోక్సభ ఎన్నికల బహిష్కరణ

## మంచిర్యాలలో ఓ గ్రామం తీర్మానం

అదిలాబాద్, : గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించడం లేదని రాజారాం గ్రామస్థులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఎన్నో ఏళ్ళుగా ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నప్పటికీ రోడ్డు సౌకర్యం కల్పించడం లేదని ప్రతిసారి ఎన్నికల సమయంలో నేతలు హామీలు ఇచ్చి ఆపై మర్చిపోతున్నారని అన్నారు. ఈ సారి ఎన్నికల్లో ఓటు వేయకూడదని గ్రామంలో వారంతా నిర్ణయానికి వచ్చారు.

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలో ఉందీ రాజారాం గ్రామం. కొత్తపల్లి, రాజారాం రెండు గ్రామాలు కలిపి రాజారాం పంచాయితీ ఏర్పడింది.

ఈ రాజారాం, కొత్తపల్లి గ్రామానికి గత కొన్నేళ్లుగా రోడ్డు సౌకర్యం లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా సమస్యకు పరిష్కారం దొరకలేదు. రోడ్డు లేకపోవడంతో బడికి వెళ్ళే విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రావాల్సిన 108 అంబులెన్స్ కూ?డ వచ్చే వీళ్లేకుండా పోతోందని వాపోతున్నారు. ఎన్నోసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఈ ప్రాంతం వైల్డ్ లైఫ్ పరిధిలో ఉన్నందున మౌలిక సదుపాయల కల్పనను ఫారెస్ట్ అధికారులు అడ్డుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. చెన్నూర్ నియోజకవర్గంలో ఉన్న ఈ పల్లెను ఇప్పటికే చాలా మంది ప్రజాప్రతినిధులు సందర్శించారు. రోడ్డు వేస్తామని హామీ ఇచ్చారు. అలాంటి వాళ్లు మంత్రి పదవులు కూడా అనుభవించారు కానీ సమస్యకు మాత్రం పరిష్కారం చూపలేకపోయారు. పారిపల్లి - వెంచపల్లి మీదుగా కొత్తపల్లి, రాజారాం గ్రామం 6 కిలోమీటర్ల దూరంలో ఉంది. రాజారాం గ్రామానికి రావాలంటే అక్కడ నుంచి గుంతలమయమైన మట్టి రోడ్డు ఉంది.

వర్షాకాలంలో రోడ్డంతా పాడై పోతుంది. రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంటుంది. యేటా వర్షాకాలంలో ఆ రోడ్డుపైనే ప్రయాణాలు చేసి అవస్థలు పడుతున్నారు. బబ్బేర చెలక గ్రామ సమీపంలో ఉన్న వాగు ఉప్పొంగితే అంతే సంగతులు. ఈ వాగు ఉప్పొంగి విద్యార్థులు ఇరుక్కుపోయిన ఘటనలు కూడా గ్రామస్తులు గుర్తు చేసుకుంటున్నారు. ఉపాధ్యాయులు కూడా వాగు దాటి వచ్చి పాఠాలు చెప్పే పరిస్థితి లేకపోయింది అత్యవసర పరిస్థితుల్లో గర్భిణీలను సైతం ఆసుపత్రికి తరలించాలన్న 108 వాహనం రాలేక ఇప్పటి వరకు ఒకరిద్దరూ మృత్యువాత పడ్డారు. రాజారం గ్రామంలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మాత్రమే చదువుకునేందుకు పాఠశాల ఉంది. ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుకునే విద్యార్థులంతా బబ్బెరచెల్క గ్రామానికి వెళ్లి అక్కడ ఉన్న పాఠశాలలో చదువుకుంటారు. రాజారాం నుంచి బబ్బెర చెల్కా గ్రామం రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఆ గ్రామానికి ఆనుకొని జగ్దల్పూర్- నిజామాబాద్ హైవే ఉంది. జగదల్పూర్ హైవే నుంచి బబ్బెరచెల్క మీదుగా రాజారం గ్రామం 2 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. ఇక్కడ 2 కిలమీటర్ల దూరం రోడ్డు వేస్తే సరిపోతుంది.

అటు పారిపేల్లి నుంచి కొత్తపల్లి మీదుగా రాజారాం గ్రామం 6 కిలోమీటర్ల దూరం ఉంది. అలా అయితే 6 కిలోమీటర్ల దూరం రోడ్డు వేయాల్సి వస్తోంది. కానీ వీటన్నిటికీ వైల్డ్ లైఫ్ పరిధిలో ఉన్నందున ఫారెస్ట్ క్లియరెన్స్ రాకపోవడంతో రోడ్డు పనులు నిలిచిపోతున్నాయి.

తెలుగుదేశం హయాంలో బోడ జనార్ధన్ కార్మిక శాఖ మంత్రిగా పని చేశారు. కాంగ్రెస్ హయాంలో కేంద్ర మంత్రిగా వినోద్ పని చేశారు. పెద్దపల్లి ఎంపీగా గడ్డం వివేక్, ఎమ్మెల్యేగా నల్లాల ఓదెలు, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చాక చెన్నూర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్గా నల్లాల ఓదెలు, బాల్క సుమన్ ఎంపిగా, ఆపై ఎమ్మెల్యే.. ప్రభుత్వ విప్గా పనిచేశారు. పైన చెప్పిన వారందరికీ గ్రామ సమస్యలు విన్నవించిన పరిష్కరించలేకపోయారు. ఇటీవలే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. చెన్నూర్ ఎమ్మెల్యేగా గడ్డం వివేక్ గెలుపొందారు.

ఆయన సైతం రాజారం కొత్తపల్లి గ్రామాలను సందర్శించి ఎన్నికల సమయంలో గ్రామస్తులకు హామీ ఇచ్చారు. గెలుపొందాక తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పిస్తామన్నారని, ఇప్పటికీ అలాంటి ప్రతిపాదనలు ఏమీ లేవని గ్రామస్తులు వాపోతున్నారు.

# 17 సీట్లు... టెన్త్, ఇంటర్ అభ్యర్థులు 23 మంది

హైదరాబాద్: అంతా యువ భారతం అంటుంటారు. భారత జనాభాలో 65 శాతం కంటె ఎక్కువ మందే 35 ?ళ్ల లోపు వారే కావడం గమనార్హం. యావరేజ్ న చూసుకుంటే 29 శాతం యువకునే. అయితే భారత్ లో రాజకీయ నాయకులంతా ఎక్కువగా వయసు మళ్లినవారే కావడం విశేషం. యువకులు, ఉన్నత చదువులు చదువుకున్న వారు రాజకీయాలపై పెద్దగా ఆసక్తిత చూపకపోవడమే ఇందుకు కారణంగా కనిపిస్తోంది. ఆ విషయాలు పక్కన బెడితే తెలంగాణ రాష్ట్రం నుంచి లోక్సభ ఎన్నికల బరిలో నిలిచిన మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు 51 మంది. నామినేషన్ పత్రంలో అందజేసిన సమాచారం ప్రకారం వారిలో 17 మంది ఇంటర్ లోపు చదివిన వారే కావడం ఆశ్చర్యం కలిగిస్తోంది. 51 మంది అభ్యర్థులలో .

ఐదుగురు వైద్యులు కాగా.. మజ్లిస్ అభ్యర్థితో కలిపి ఐదుగురు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించారు. ఒక మాజీ ఐఏఎస్ అధికారి, ఒక మాజీ ఐపీఎస్ అధికారి ఎన్నికల బరిలో నిలిచి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. అభ్యర్థుల అఫిడవిట్ల మేరకు వారి విద్యార్హతలివీ.. ఆరుగురు పది, ఆలోపు చదివిన వారే. ప్రధాన పార్టీల తరఫున బరిలో ఉన్నవారిలో పదో తరగతి అంతకంటే తక్కువ చదివినవారు ఆరుగురు కాగా.. ఇంటర్ చదివిన వారు 11 మంది ఉన్నారు. ఇక రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వెంకట్రామిరెడ్డి మెదక్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తుండగా, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఆర్.ఎస్.ప్రవీణ్కుమార్ నాగర్కర్నూల్ నుంచి బీఆర్ఎస్ తరఫున బరిలో ఉన్నారు. మరో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ నల్గొండ లోక్సభ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఆర్.ఎస్.ప్రవీణ్కుమార్ హార్వర్డ్ యూనివర్సిటీలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్లో మాస్టర్స్ చేశారు. హైదరాబాద్ ఎంఐఎం అభ్యర్థి అసదుద్దీన్ ఓవైసీ లండన్లో లా పూర్తిచేశాచేవెళ్ల భాజపా అభ్యర్థి కొండా విశ్వేశ్వర్రెడ్డి అమెరికాలో ఎంఎస్ చదివారు. పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ అమెరికాలో గ్రాడ్యుయేషన్ చేశారు. భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్కుమార్రెడ్డి సైప్రస్లో హోటల్ మేనేజ్మెంట్ కోర్సు చదివారు. ఇక మల్లు రవి (కాంగ్రెస్), కడియం కావ్య (కాంగ్రెస్), బూర నర్సయ్యగౌడ్ (భాజపా), సుధీర్కుమార్ (భారాస)లు ఎంబీబీఎస్, ఆపై చదువులతో వైద్యులుగా సేవలందించారు. చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్రెడ్డి వెటర్నరీ సైన్స్లో మాస్టర్స్ (ఎంవీఎస్సీ) చేశారు. మహబూబాబాద్ భాజపా అభ్యర్థి ప్రొఫెసర్ అజ్మీరా సీతారాంనాయక్ పీహెచ్డీ చేశారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వెంకట్రామిరెడ్డి సహా 11 మంది పోస్టుగ్రాడ్యుయేట్లు (పది మంది ఎంఏ, ఒకరు ఎంబీఏ). ఒకరు బీటెక్ చేయగా.. మరో 10 మంది వివిధ డిగ్రీలు చదివారు. బీబీ పాటిల్ (భాజపా), సురేశ్షెట్కార్ (కాంగ్రెస్)లు మహారాష్ట్రలో ఏజీ బీఎస్సీ చేశారు. ఇద్దరూ జహీరాబాద్లో తలపడుతున్నారు. టి.జీవన్రెడ్డి (కాంగ్రెస్), బి.వినోద్కుమార్ (భారాస), రఘునందన్రావు (భాజపా)లు న్యాయవిద్య (ఎల్ఎల్బీ) అభ్యసించారు. ఇద్దరు డిప్లొమా పూర్తిచేశారు.

# కరీంనగర్ లో త్రిముఖ పోటీ

కరీంనగర్: తెలంగాణ రాష్ట్రంలో అందరి దృష్టి కరీంనగర్ పార్లమెంటు స్థానంపై ఉంది. ఇక్కడ బలమైన అభ్యర్థులు బరిలొకి దిగడంతో పోరు మరింత అసక్తిరే రేపుతుంది. అధికార పార్టీ కాంగ్రెస్ అరు గ్యారంటీలపై నమ్మకం పెట్టుకుంటే, బిజెపి కేంద్ర ప్రభుత్వం పథకాలతో పాటు, హిందుత్వ వాదం, అయోధ్య రామాలయంను నమ్ముకుంది. బిఆర్ఎస్ గతంలో చేసిన అభివృద్ధి సెంటిమెంట్ అంశాలను నమ్ముకుంది. ఈ మూడు పార్టీలు ప్రచార స్పీడ్?తో దూకుడు పెంచాయి. కరీంనగర్?లో రాజకీయ చైతన్యం ఎక్కువ. ఇక్కడ అప్పటి పీపుల్స్ వార్స్ నుంచి తెలంగాణ ఉద్యమం దాక ఎన్నోఉద్యమాలు జరిగాయి. ప్రజా చైతన్యంతో ప్రభుత్వాలు దిగి వచ్చాయి. ప్రతి ఎన్నికలలో కూడా కరీంనగర్ ప్రజలు విభిన్నమైన తీర్పుని ఇస్తారు. ఇప్పుడు జరుగుతున్న పార్లమెంటు ఎన్నికలలో ప్రజలు ఏ పక్షాన నిలబడుతారో మరింత ఆసక్తిని రేపుతుంది. కరీంనగర్ పార్లమెంటు పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. మొత్తం 17 లక్షల 92 వేలకి పైగా ఓట్లు ఉన్నాయి. ఇక్కడ కాంగ్రెస్ నుంచి వెలిచాల రాజేందర్ రావు, బీజేపి నుంచి బండిసంజయ్ కుమార్, బిఅర్ఎస్ నుంచి వినోద్ కుమార్ బరిలొకి దిగుతున్నారు. గత ఎన్నికలలో బండిసంజయ్ వర్సెస్ వినోద్ కుమార్ మధ్యనే పోటి ఉంది. ఇప్పుడు కాంగ్రెస్ నుంచి కొత్త అభ్యర్థి బరిలొకి దిగుతున్నారు. బిఅర్ఎస్, బిజెపి అభ్యర్థుల పేర్లు చాల రోజుల క్రితమే ప్రకటించారు. కాంగ్రెస్ మాత్రం పేరు ప్రకటనలలో ఆలస్యం చేసింది. ఇప్పటికే ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసారు. ఇక అభ్యర్థులు అంతా ప్రచారంపై దృష్టి పెట్టారు. కరీంనగర్ పార్లమెంటు పరిధిలో అధికంగా రైతుల ఓట్లే ఉన్నాయి. ప్రతిపక్షాలు రైతుల సమస్యలపైన ఫోకస్ చేస్తున్నాయి. ఇప్పటికే బిజెపి అభ్యర్థి సంజయ్ కొనుగోలు కేంద్రాలకి వెళ్ళి వరి ధాన్యానికి ఐదు వందల రూపాయల బోనస్ గురించి మాట్లాడుతున్నారు. వినోద్ కుమార్ కూడ ఇదే అంశంపై దృష్టి పెట్టారు. కాంగ్రెస్ ప్రతిపక్ష పార్టీలకి కౌంటర్ ఇస్తున్నారు. రైతుసమస్యల పరిష్కారంలో తమకే చిత్తశుద్ధి ఉందని చెబుతున్నారు. ఈ నియోజకవర్గంలో రైతులతో పాటు చేనేత కార్మికులు గల్ఫ్ కార్మికులు గెలుపు ఓటములపై ప్రభావం చూపనున్నారు. ఇప్పటికే నేత కార్మికుల సమస్యలపైనా మూడు పార్టీలు విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకుంటున్నాయి.

# సీఎస్ ను వదలని సైబర్ కేటుగాళ్లు

హైదరాబాద్: సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. తమకు పనికొచ్చే ఏ ఒక్క మార్గాన్ని వదలట్లేదు. టెక్నాలజీని ఉపయోగించి జనాలను నిలువు దోపడీ చేసేస్తున్నారు. వాట్సాప్, ఫేస్ బుక్, ఇన్స్టాగ్రాం అనే తేడా లేకుండా సోషల్ మీడియా ఫ్లాట్ఫామ్లలో ఫేక్ ప్రొఫైల్స్ క్రియేట్ చేస్తూ అమాయకుల జీవితాలు నెట్టింట అమ్మకానికి పెట్టేస్తున్నారు. అయితే.. ఈ ఇబ్బందులు సామాన్యులకే కాదు సెలబ్రెటీలు, రాజకీయ నేతలుతో పాటు పోలీసు ఉన్నతాధికారులకు కూడా తప్పడం లేదు. గతంలో కొంతమంది సైబర్ నేరగాళ్లు ఐఏఎస్, ఐపీఎస్ల ఫోటోలు, పేర్లు వాడుకొని.. బెదిరించి డబ్బు దోచుకున్న ఘటనలు జరిగాయి. తాజాగా అలాంటి ఘటనే.. తెలంగాణ సీఎస్ శాంతికుమారికి ఎదురైంది.తెలంగాణ సీఎస్ శాంతికుమారి తన పేరు, ఫొటోతో.. పలువురికి ఫేక్ కాల్స్ చేస్తున్నారు సైబర్ మోసగాళ్లు. ఈ విషయాన్ని తెలుసుకున్న శాంతికుమారి.. వెంటనే సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు. +977-984-4013103 ఫోన్ నెంబర్తో కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు.. ఇటీవల కొందరికి కాల్స్ చేస్తున్నారని తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు శాంతి కుమారి ఫిర్యాదు చేశారు. తన పేరుతో ఫేక్ కాల్స్ చేస్తున్నవారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని సీఎస్ శాంతికుమారి కోరారు. కేసు నమోదు చేసుకున్న టీఎస్సీఎస్బీ ఫేక్ కాల్స్ చేసినవారిని కనిపెట్టే పనిలో పడ్డారు.గతంలో కూడా అంజనీ కుమార్తో పాటు పలువురు పోలీసు ఉన్నతాధికారుల ఫొటోలు, పేర్లతో ఫేక్ అకౌంట్లు క్రియేట్ చేసి డబ్బులు డిమాండ్ చేశారు. ఫేక్ కాల్స్ చేసి.. కొందరిని బెదిరింపులకు పాల్పడ్డ ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. కాగా.. ఇప్పుడు ప్రభుత్వంలో కీలక పదవిలో ఉన్న ఒక సీఎస్ను కూడా కేటుగాళ్లు వదలకపోవటం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి వాటిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని.. ఉన్నతాధికారుల పరిస్థితే ఇలా ఉంటే.. ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే.. ఇలాంటి ఫేక్ కాల్స్ కానీ, సైబర్ నేరగా?ళ్ల కదలికలు కానీ గుర్తించినప్పుడు అప్రమత్తంగా ఉండి.. ఎలాంటి వివరాలు ఇవ్వకుండా.. వెంటనే తమను సంప్రదించాలని... పోలీసులు సూచిస్తున్నారు.

# విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రభుత్వ స్పందన లేదు

రంగా రెడ్డి: పాలన మీద దృష్టి పెట్టకుండా గాలికి వదిలేశారు అని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వనీ విమర్శించారు. ఇంటర్మీడియట్ విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటే కనీసం ప్రభుత్వం స్పందన లేదని, తెలంగాణ సమాజానికి భరోసా కల్పించే ఎలాంటి కార్యక్రమాలు ఈ ప్రభుత్వం చేపట్టడం లేదని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని అల్మాస్ గూడ గ్రామంలో పలు డివిజన్ లో తీవ్రమైన నీటి సమస్య ఎదుర్కొంటున్న కాలనీలలో అధ్యక్షుడు రామిడి రామిరెడ్డి తో కలిసి సబితా ఇంద్రారెడ్డి సందర్శించారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన నూతన వాటర్ ట్యాంక్ సందర్శించి త్వరగా ట్యాంక్ పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అలాగే కాలనీవాసులు ఈ యొక్క నీటి సమస్య త్వరలోనే తీరుతుందని గత ప్రభుత్వం ఈ నీటి సమస్యపై ముందుగానే అంచన వేసి మన నియోజకవర్గంలో 9 రిజర్వాయర్లను ఏర్పాటు చేసాం. అవి త్వరలోనే పూర్తి కావడం జరుగుతుందని తొందర్లోనే ఈ యొక్క నీటి సమస్య తీరుతుందని అధికారులతో మాట్లాడి ఈ యొక్క ప్రస్తుత సమస్యను వాటర్ ట్యాంకుల ద్వారా గాని అలాగే కాలనీలలో బోర్లు వేయించి నీటి సమస్యను తీర్చాలని సంబంధిత అధికారులతో చర్చించి మీ యొక్క సమస్య తీస్తానని చెప్పారు.


# ’పుష్ప-2’ ది రూల్ నుంచి రేపు విడుదల కానున్న సన్సేషనల్ లిరికల్ వీడియో సాంగ్ పుష్ప..... పుష్ప... పుష్ప... పుష్పరాజ్

ప్రపంచవ్యాప్తంగా సినిమా ప్రేక్షకులు ఎదురుచూస్తున్న చిత్రం పుష్ప-2 ది రూల్. పుష్ప ది రైజ్‌తో ప్రపంచ సినీ ప్రేమికులను అమితంగా ఆకట్టుకోవడమే ఇందుకు కారణం. ఈ చిత్రంలో ఐకాన్‌స్టార్ నటనకు, బ్రిలియంట్ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వ ప్రతిభకు అందరూ ఫిదా అయిపోయిన సంగతి తెలిసిందే. అయితే ఇక ప్రస్తుతం నిర్మాణంలో వున్న సీక్వెల్ పుష్ప-2 ది రూల్ గురించి ఎటువంటి అప్‌డేట్ అయినా సన్సేషన్. తాజాగా చిత్ర యూనిట్ ఇచ్చిన అప్‌డేట్‌తో అటు ఐకాన్‌స్టార్ అభిమానులు, ఇటు పుష్ప ప్రేమికులు సంబరాల్లో వున్నారు. ‘పుష్ప-2’ దిరూల్ నుంచి రేపు సాయంత్రం 5 గంటల 4 నిమిషాలకు తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ, బెంగాలీ భాషల్లో
పుష్ప..... పుష్ప... పుష్ప... పుష్పరాజ్ అనే తొలి లిరికల్ వీడియోను విడుదల చేస్తున్నట్లుగా ప్రకటించారు మేకర్స్. ఈ అప్‌డేట్‌తో ఐకాన్‌స్టార్ అభిమానులు సంబరాల్లో వున్నారు. ఇందుక సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో ఐకాన్‌స్టార్ పూర్తి మాస్‌గెటప్‌లో నడుస్తూ కనిపిస్తున్నారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా జీనియస్ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన పుష్ప ది రైజ్.. ఎంతటి సంచలన విజయం సాధించిందో ప్రత్యేకంగా గుర్తు చేయాల్సిన అవసరం లేదు. 2021 బిగ్గెస్ట్ కమర్షియల్ బ్లాక్ బస్టర్ గా నిలిచింది పుష్ప. అల్లు అర్జున్ కెరీర్ లోనే అతిపెద్ద విజయంగా నిలవడంతోపాటు.. తనకు జాతీయస్థాయి అవార్డు తెచ్చి పెట్టిన చిత్రంగా పుష్ప నిలిచింది. దీంతో దీనికి సీక్వెల్ గా తెరకెక్కుతోన్న పుష్ప-2 ద రూల్ చిత్రం పై భారీ అంచనాలు పెరిగాయి.

2024 ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ గా విడుదల చేయనున్నట్టు ప్రకటించిన సంగతి తెలిసిందే.

నటీనటులు:

అల్లు అర్జున్, రష్మిక మందన్న, ఫహాద్ ఫాజిల్, ధనుంజయ్, సునీల్, అనసూయ భరద్వాజ్ తదితరులు



# అశోక్ గల్లా అర్జున్ జంధ్యాల, లలితాంబిక ప్రొడక్షన్స్ ‘దేవకీ నందన వాసుదేవ’ ఫస్ట్ సింగిల్ ఏమయ్యిందే మే3న విడుదల




’హీరో’ చిత్రంతో సక్సెస్ ఫుల్ గా ఎంట్రీ ఇచ్చిన సూపర్ స్టార్ కృష్ణ మనవడు, సూపర్ స్టార్ మహేష్ బాబు మేనల్లుడు అశోక్ గల్లా ప్రస్తుతం గుణ 369 ఫేమ్ అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో ‘దేవకీ నందన వాసుదేవ’చేస్తున్నారు. హనుమాన్ ఫేమ్ క్రియేటివ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ ఈ చిత్రానికి కథ అందించారు. ప్రముఖ రచయిత సాయి మాధవ్ బుర్రా డైలాగ్స్ రాస్తున్నారు. లలితాంబిక ప్రొడక్షన్స్‌లో ప్రొడక్షన్ నెం. 1గా ఎన్‌ఆర్‌ఐ (ఫిలిం డిస్ట్రిబ్యూటర్) సోమినేని బాలకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నల్లపనేని యామిని సమర్పిస్తున్నారు. గతంలో కథానాయకుడి పాత్రను పరిచయం చేసిన టీజర్ సినిమా ప్రిమైజ్ ని ప్రజెంట్ చేసింది. టీజర్ కు చాలా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్ ని కిక్ స్టార్ చేశారు మేకర్స్. ఫస్ట్ సింగిల్ ఏమయ్యిందే ప్రోమోను విడుదల చేశారు. ఇటీవలి కాలంలో అనేక చార్ట్‌బస్టర్ ఆల్బమ్‌లను అందించిన సెన్సేషనల్ కంపోజర్ భీమ్స్ సిసిరోలియో ఆకట్టుకునే బీట్‌లతో అద్భుతమైన పాటని అందించారు.

ఈ పాట అశోక్ గల్లా తన లవ్ వారణాసి మానస పట్ల ఆరాధనని చూపుతుంది. ఈ పాటలో అశోక్ గల్లా ఆనందంగా కనిపించగా, వారణాసి మానస అందంగా ఉంది. వీరి జోడి తెరపై ఆకర్షణీయంగా కనిపించింది. పూర్తి సాంగ్ మే3 న విడుదల చేస్తామని మేకర్స్ అనౌన్స్ చేశారు.

గ్రాండ్ ప్రొడక్షన్ డిజైన్‌తో భారీ ఎత్తున తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ప్రసాద్ మూరెళ్ల డీవోపీగా పని చేస్తున్నారు. తమ్మిరాజు ఎడిటర్.

నటీనటులు: అశోక్ గల్లా, వారణాసి మానస

## భయపెడుతూనే నవ్విస్తాం



భయపెడుతూనే నవ్విస్తాంఅత్యంత విజయవంతమైన హార్రర్ కామెడీ సిరీస్ ‘అరణ్మనై’ నుంచి సుందర్. సి, తమన్నా భాటియా, రాశీ ఖన్నా నటించిన ‘అరణ్మనై 4’ మే 3న థియేట్రికల్ విడుదలకు సిద్ధమవుతోంది. తెలుగులో ‘బాక్’ అనే టైటిల్‌తో వస్తున్న ఈ చిత్రానికి సుందర్ సి దర్శకత్వం వహించారు. గ్రాండ్‌గా జరిగిన ఈ చిత్ర ప్రీరిలీజ్ ఈవెంట్‌లో మేకర్స్ ‘బాక్’ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. హీరోయిన్ రాశి ఖన్నా మాట్లాడుతూ,’డైరెక్టర్ సుందర్ సి ఈ సినిమాకి బ్యాక్ బోన్. ఆయన చాలా క్లియర్ విజన్‌తో సినిమా చేశారు. నాకు హార్రర్ సినిమాలు చాలా ఇష్టం. కానీ అవి తీయడం ఎంత కష్టమో ఈ సినిమా సమయంలో తెలిసింది. చాలా అద్భుతమైన టెక్నికల్ టీంతో ఈ సినిమా చేశాం. మ్యూజిక్ వండర్ ఫుల్‌గా ఉంటుంది. ఈసారి ‘బాక్’కి గ్లామర్ పెరిగింది. తమన్నా ఇప్పటివరకూ చేయని ఓ కొత్త పాత్రలో కనిపించబోతున్నారు. ఇప్పటికే పాట వైరల్ అవుతుంది. ఇందులో హార్రర్ గ్లామర్, థ్రిల్, కామెడీ అన్నీ ఉన్నాయి. కోవై సరళతో వర్క్ చేయడం మంచి అనుభూతి. బాక్ మే 3న వస్తోంది. ఇది పర్ఫెక్ట్ సమ్మర్ ట్రీట్. ఫ్యామిలీతో కలసి చూడాలి. ఫ్యామిలీ ఆడియన్స్, పిల్లలు ఎంజాయ్ చేసే సినిమా ఇది. తెలుగులో విడుదల చేస్తున్న సురేష్ ప్రొడక్షన్‌కి ధన్యవాదాలు’ తెలిపారు.

# సర్‌ప్రైజ్ చేసే కంటెంట్ ఉంది

సర్‌ప్రైజ్ చేసే కంటెంట్ ఉందిసుహాస్ హీరోగా రూపొందిన యూనిక్ సస్పెన్స్ థ్రిల్లర్ ‘ప్రసన్న వదనం’. డైరెక్టర్ సుకుమార్ అసో సియేట్‌గా పని చేసిన అర్జున్ వై కె దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని జెఎస్ మణికంఠ, టి ఆర్ ప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. పాయల్ రాధాకృష్ణ, రాశి సింగ్ హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ఈనెల 3న సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో నిర్మాత జెఎస్ మణికంఠ మీడియాతో ముచ్చటించారు.

”కలర్ ఫోటో, ఫ్యామిలీ డ్రామా’ చిత్రాలకు సహ నిర్మాతగా చేశాను. ఓ స్నేహితుడి ద్వారా ఈ కథ నా దగ్గరకి వచ్చింది. సుకుమార్ దగ్గర దర్శకుడు అర్జున్ పని చేశారు. తను చెప్పిన కథ నాకు చాలా నచ్చింది. సుహాస్‌కి వినిపిస్తే ఆయనకి కూడా నచ్చింది. అలా ప్రాజెక్ట్ మొదలైంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇచ్చేలా సినిమా చేశాం. నిర్మాణంలో అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. బిజినెస్ పరంగా లాభాల్లో ఉన్నాం. మైత్రీ, హొంబలే లాంటి పెద్ద సంస్థలు ఈ సినిమాని విడుదల చేయడం ఆనందంగా ఉంది. ఈ సినిమా ఫేస్ బ్లైండ్ నెస్ కాన్సెప్ట్‌తో వస్తుంది. ఇలాంటి కాన్సెప్ట్ ఇండియన్ సినిమాలో ఇప్పటికీ రాలేదు. ఇది అన్నీ వర్గాల ప్రేక్షకులని అలరించేలా ఉంది. చివరి వరకూ సర్‌ప్రైజ్ అయ్యే కంటెంట్ ఉంది. ఇలాంటి కాన్సెప్ట్ సినిమాలు ఇతర భాషల్లో కూడా విడుదల చేస్తారు. మేం కూడా అదే ప్రయత్నాల్లో ఉన్నాం. తమిళంలో



ఓ పెద్ద సంస్థ నుంచి మంచి ఆఫర్ వచ్చింది. డబ్బింగ్ చేయాలా లేక రిమేక్ చేయాలా అనేది చర్చిస్తున్నాం. సుహాస్ తెలుగు పరిశ్రమకి అదృష్టం. తనపై కొత్తకథలు వర్క్ అవుట్ అవుతున్నాయి. తను చాలా క్రమశిక్షణ గల నటుడు. నిర్మాతలకు, దర్శకులకు కంఫర్టబుల్‌గా ఉంటాడు. తనతో వర్క్ చేయడం చాలా మంచి అనుభవం. ఈ సినిమా తప్పకుండా మా అందరికీ మంచి సినిమా అవుతుంది’ అని తెలిపారు.

# భిన్న కాన్సెప్ట్‌తో గుట్టు చప్పుడు

భిన్న కాన్సెప్ట్‌తో గుట్టు చప్పుడుడాన్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై బ్రహ్మాజీ కుమారుడు సంజయ్ రావ్, ఆయేషాఖాన్ జంటగా మణీంద్రన్ దర్శకత్వంలో డాఎం లివింగ్‌స్టన్ నిర్మిస్తున్న రొమాంటిక్ మాస్, యాక్షన్, లవ్ ఎంటర్‌టైనర్ ‘గుట్టు చప్పుడు’. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్ర టీజర్‌ను తాజాగా హీరో సాయి దుర్గా తేజ్ సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. ఈ నేపథ్యంలో ప్రసాద్‌ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నటులు బ్రహ్మాజీ టీజర్‌ని రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ‘మా అబ్బాయి నటిస్తున్న 3వ సినిమా ఇది. మంచి నిర్మాత, టెక్నీషియన్స్‌ను కుదిరారు. భారీ బడ్జెట్‌తో తీశారు.

దర్శకుడు కూడా తీసిన కంటెంట్‌ను మళ్లీ చెక్ చేసుకుంటూ జాగ్రత్తగా ఈ సినిమా చేశారు. ఈ టీజర్ చూసిన తర్వాత సినిమా ఘన విజయం సాధిస్తుందనే నమ్మకం ఏర్పడిరది’ అని తెలిపారు.

‘డైరెక్టర్ మణీంద్రన్ కథ చెప్పినప్పుడు ఎగ్జైట్‌గా ఫీలయ్యా. ఇదొక ప్రేమ, యాక్షన్, రొమాంటిక్‌తో పాటు మంచి మెసేజ్‌తో కూడిన సినిమా. హీరో సంజరు రెండు రకాల షేడ్స్‌ను అద్భుతంగా చేశారు. టీజర్‌లో మీరు చూసింది కొద్దిగానే. సినిమాలో ఇంకా మంచి స్టఫ్ ఉంది. క్లైమాక్స్ ఫైట్‌ను దాదాపు 75 లక్షల రూపాయలతో జహీరాబాద్ షుగర్ ఫ్యాక్టరీలో తీశాం’ అని నిర్మాత లివింగ్‌స్టన్ చెప్పారు.

సంగీత దర్శకుడు గౌర హరి మాట్లాడుతూ,’ సంగీతానికి మంచి స్కోప్



ఉండేలా దర్శకుడు కథను రాసుకోవడం నాకు బాగా ప్లస్ అయ్యింది’ అని అన్నారు.

దర్శకుడు మణీంద్రన్ మాట్లాడుతూ,’నిర్మాత సహకారం వల్లే సినిమా ఇంత గ్రాండ్‌గా వచ్చింది. మ్యూజిక్ డైరెక్టర్ గౌర హరి సంగీతం ఈ సినిమాకు హైలెట్. ప్రేక్షకులు పెట్టిన డబ్బుకు మించిన ఆనందాన్ని ఇచ్చే సినిమా ఇది’ అని తెలిపారు. ‘ఇది నాకు 3వ సినిమా. ఇది నాకు మంచి టర్నింగ్ పాయింట్ ఇచ్చే సినిమా. అందరినీ ఆకట్టుకునే అన్ని అంశాలూ ఇందులో ఉన్నాయి. మా అందరికీ సూపర్ సక్సెస్ ఇచ్చే సినిమా ఇది’ అని హీరో సంజరురావు అన్నారు.

## బ్రహ్మచారి రిలీజ్‌కి రెడీ



బ్రహ్మచారి రిలీజ్‌కి రెడీఅద్వితీయ ఎంటర్‌టైనర్స్ బ్యానర్‌పై రాంభూపాల్ రెడ్డి నిర్మాతగా నర్సింగ్‌ని దర్శకుడిగా పరిచయం చేస్తూ తెరకెక్కిస్తున్న చిత్రం ‘బ్రహ్మచారి’. ఏఎన్నార్, కమల్ హాసన్ లాంటి మహామహులు నటించిన ‘బ్రహ్మచారి’ టైటిల్‌తో వచ్చిన సినిమాలు బాగా సక్సెస్ అయినట్లే తెలంగాణ యాసలో వస్తున్న పర్‌ఫెక్ట్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపొందింది. యూట్యూబ్‌లో షార్ట్ ఫిల్మ్స్ చేసే మల్లేశం హీరోగా నటించిన ఈ చిత్రం ఈనెల 10న థియేటర్లలో విడుదల కానుంది.

ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ప్రీరిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించింది. ప్రసాద్ ల్యాబ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో దర్శకుల సంఘం అధ్యక్షుడు వీర్‌శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని చిత్ర యూనిట్‌కు విషెస్ తెలియజేశారు. నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్, సీనియర్ డైరెక్టర్ చంద్ర మహేశ్ తదితరులు పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.


హీరో గుంట మల్లేశం మాట్లాడుతూ, ‘నేను ఒగ్గుకథ కళాకారుణ్ణి. అలాంటి నన్ను నర్సింగ్ ఆర్టిస్ట్ చేశాడు. ఇలాంటి మంచి కామెడీ సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు ధన్యవాదాలు. ఈనెల 10న విడుదలయ్యే ఈ సినిమా ఎలా ఉంటుందో చెప్పేందుకు ఇదొక శాంపిల్ మాత్రమే. మా సినిమా టీమ్‌ను ఆశీర్వదించాల్సిందిగా ప్రేక్షకులందరినీ కోరుతున్నా’ అని అన్నారు. ‘ఈ సినిమా తీయడానికి కథ చెప్పేటప్పుడు చాలా నేచురల్‌గా అనిపించింది. ఊళ్లో రచ్చబండ వద్ద మాట్లాడుకునేలా ఉంది. సినిమా తీశాక చాలా అద్భుతంగా వచ్చింది. ఈ చిత్రాన్ని నాలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నాం. ఈ సినిమా మంచి హిట్ అయితే మరిన్ని సినిమాలు తీసే ప్రోత్సాహం లభిస్తుంది. ప్రేక్షకులంతా ఈ సినిమాను హిట్ చేయాలని కోరుతున్నా’ అని నిర్మాత రాంభూపాల్ రెడ్డి చెప్పారు.

## యూనిక్ సస్పెన్స్ థ్రిల్లర్



యూనిక్ సస్పెన్స్ థ్రిల్లర్సుహాస్ హీరోగా రూపొందిన యూనిక్ సస్పెన్స్ థ్రిల్లర్’ ప్రసన్న వదనం’. సుకుమార్ వద్ద అసోసియేట్‌గా పని చేసిన అర్జున్ వై కె దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని జెఎస్ మణికంఠ, టి ఆర్ ప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. పాయల్ రాధాకృష్ణ, రాశి సింగ్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. మే3న సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది.ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ ట్రైలర్ లాంచ్, ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. డైరెక్టర్ సుకుమార్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్‌గా జరిగింది. దర్శకులు బుచ్చిబాబు, కార్తిక్ దండు, శ్రీనివాస్ అవసరాల, రైటర్ ప్రసన్న ఈ వేడుకలో పాల్గొన్నారు. డైరెక్టర్ సుకుమార్ మాట్లాడుతూ,’సుహాస్‌ని మట్టి నటుడు అనాలేమో. అంత ఆర్గానిక్‌గా ఉంది. తన నటన చూస్తున్నాను. ఆయా పాత్రల్లో ఇమిడిపోతాడు. మా అర్జున్ మంచి లాజిక్‌తో ప్రసన్న వదనం తీసాడు. ఈ సినిమా చూశాను. చాలా బావుంది. అంత చక్కగా తీశాడు’ అని తెలిపారు.

## లంకల రత్న విశ్వరూపం



లంకల రత్న విశ్వరూపంవిశ్వక్ సేన్ నటిస్తున్న చిత్రం ‘గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి’. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి కృష్ణ చైతన్య దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఏఎంబీ మాల్‌లో జరిగిన కార్యక్రమంలో టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో విశ్వక్ సేన్ మాట్లాడుతూ, ‘ఈ సినిమా తరువాత.. గ్యాంగ్స్ ఆఫ్ గోదావరికి ముందు, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరికి తరువాత అనేలా నా కెరీర్ ఉంటుంది. మే 17న థియేటర్లలో కలుద్దాం’ అని తెలిపారు. ‘విశ్వక్ నటించిన పక్కా మాస్ సినిమా. ఈ మూవీ ఏ రేంజ్ కి వెళ్తుంది అనేది మొదటి షోకి తెలిసిపోతుంది. టిల్లు స్క్వేర్ స్థాయిలో బ్లాక్ బస్టర్ అవుతుందని ఆశిస్తున్నాం’ అని నిర్మాత సూర్యదేవర నాగ వంశీ చెప్పారు. దర్శకుడు కృష్ణ చైతన్య మాట్లాడుతూ, ‘లంకల రత్న’గా విశ్వక్ విశ్వరూపం చూస్తారు’ అని అన్నారు.

# పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్అల్లరి నరేష్ నటించిన అవుట్ అండ్ అవుట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ ‘ఆ ఒక్కటీ అడక్కు’. మల్లి అంకం దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రాన్ని చిలక ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజీవ్ చిలక నిర్మించారు. ఫరియా అబ్దుల్లా హీరోయిన్. మే 3న ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో దర్శకుడు మల్లి మీడియాతో ముచ్చటించారు.

”ఆ ఒక్కటీ అడక్కు’ ఈ కథకు యాప్ట్ టైటిల్. ఈ టైటిల్ పెట్టాలనే ఆలోచన కూడా నరేష్‌దే. కేవలం టైటిల్ వరకే తీసుకున్నాం. ఈ కథకు, ఆ సినిమాకు సంబంధం లేదు. పెళ్లి చుట్టూ ఎలాంటి ఎమోషన్స్ వుంటాయి?, కొందరు ఆ ఎమోషన్స్‌ని ఎలా క్యాష్ చేసుకుంటారు? ఇలాంటి అంశాలని చాలా వినోదాత్మకంగా చూపిస్తూనే ఎమోషనల్ కనెక్ట్ అయ్యేలా ప్రెజెంట్ చేశాం. ఇందులో ఉండే కంటెంట్‌కి అందరూ కనెక్ట్ అయ్యేలా వుంటుంది. ఇది అందరినీ అలరించే మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. హీరోని పెళ్లి గురించి అందరూ అడుగుతున్నప్పుడు ఆయన సమాధానంగా చెప్పే మాట ‘ఆ ఒక్కటీ అడక్కు’. నిజానికి పెళ్లి గురించి అందరూ చాలా తేలిగ్గా అడిగేస్తారు కానీ.. తీసుకున్నవారు దాన్ని చాలా పెయిన్ ఫీల్ అవుతారు. ఆ కుటుంబంలో కూడా అదో బాధలా ఉంటుంది.

ఇందులో ఆ ఎమోషన్‌ని వినోదాత్మకంగా చూపించే ప్రయత్నం చేశాం. ఇందులోని కామెడీ, ఎమోషన్ ఆడియన్స్‌ని హత్తుకునేలా ఉంటాయి. ఇందులో ప్రత్యేకంగా సందేశంలా ఉండదు. కానీ.. పెళ్లి ఎప్పుడు?



అని అడగడం కన్నా మీ దగ్గర ఏదైనా మంచి సంబంధం ఉంటే చూసి పెట్టండనే ఆలోచనని రేకెత్తించేలా ఈ సినిమా ఉంటుంది. అలాగే పెళ్లి సంబంధాల విషయంలో ఎంత జాగ్రత్తగా ఉండాలో కూడా చూపించే సినిమా కూడా ఇది. నరేష్ ఫస్ట్ హాఫ్ విని ‘ఈ కథ మనం చేసేద్దాం’ అన్నారు. ఆయన క్యారెక్టరైజేషన్, పెర్ఫార్మెన్స్ ప్రేక్షకులని అద్భుతంగా అలరిస్తాయి. ఫారియా పాత్ర ఇందులో చాలా కీలకంగా వుంటుంది. కథ ఆమె పాత్ర ద్వారానే మలుపు తిరుగుతుంది. ఫరియాలో మంచి కామెడీ టైమింగ్ వుంది. ఇందులో తన పాత్రని చాలా అద్భుతంగా చేసింది’ అని చెప్పారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**